# చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో యాక్సెస్ కంట్రోల్ సిస్టమ్

* 20 నిమిషాలు దాటితే రూ.50 నుంచి రూ.500 వరకు ఛార్జీలు
* రేపటి నుంచి కొత్త నిబంధనలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించడం, స్టేషన్ పరిసరాల్లో ట్రాఫిక్ రద్దీని తగ్గించడం లక్ష్యంగా దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్) చర్లపల్లి రైల్వే స్టేషన్ దక్షిణ వైపు (ప్లాట్‌ఫామ్ నెం.9 వైపు) యాక్సెస్ కంట్రోల్ సిస్టమ్‌ను ఈ నెల 15వ తేదీ అర్ధరాత్రి నుంచి అమలు చేయనున్నట్లు ప్రకటించింది. స్టేషన్‌లో వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించేందుకు, అనధికార పార్కింగ్‌ను అరికట్టేందుకు ఈ విధానం తీసుకువస్తున్నారు. కొత్తగా అభివృద్ధి చేసిన చర్లపల్లి రైల్వే టెర్మినల్‌లో విశాలమైన వెయిటింగ్ హాల్స్, ఆధునిక ప్లాట్‌ఫారాలు, లిఫ్టులు, ఎస్కలేటర్లు, ప్రీమియం టాయిలెట్లు, మెరుగైన సమాచార వ్యవస్థలు అందుబాటులో ఉన్నాయి. అలాగే 6,622 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ద్విచక్ర, త్రిచక్ర, నాలుగు చక్రాల వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం ఏర్పాటు చేశారు. రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులను దింపడం లేదా ఎక్కించేందుకు వచ్చే వాహనాలకు తొలి 20 నిమిషాల వరకు ఎలాంటి రుసుము ఉండదు. అయితే 20 నిమిషాలు దాటితే రూ.50 నుంచి రూ.500 వరకు ఛార్జీలు విధించనున్నారు. అన్ని వాహనాలకు డిజిటల్ టికెటింగ్, ప్రవేశనిష్క్రమణ సమయాలతో కూడిన డిజిటల్ రసీదులు జారీ చేయనున్నారు. యాక్సెస్ కంట్రోల్ ఛార్జీలను పరిశీలిస్తే 020 నిమిషాలు – ఉచితం,20–30 నిమిషాలు... రూ.50, 30–45 నిమిషాలు...రూ.100, 45–60 నిమిషాలు... రూ.200, 60నిమిషాలకు మించి...రూ.500. అలాగే పార్కింగ్ ప్రాంతం లో నాలుగు చక్రాల వాహనాలకు తొలి రెండు గంటలకు రూ.20, తదుపరి ప్రతి గంటకు రూ.10, ద్విచక్ర, త్రిచక్ర వాహనాలకు తొలి రెండు గంటలకు రూ.15, ఆ తర్వాత ప్రతి గంటకు రూ.10 చొప్పున రుసుము వసూలు చేయనున్నారు. ఈ వ్యవస్థ అమలుతో స్టేషన్ ముందు భాగంలో ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు ప్రయాణికులు ఆటోలు, ట్యాక్సీలు, బస్సు లు వంటి రవాణా సౌకర్యాలను సులభంగా వినియోగించుకునే అవకాశం కలుగుతుందని దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు.




## ‘9 ఎడ్యుకేషన్’ యాజమాన్యంపై చర్యలకు డిమాండ్

### ఎఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎండి అన్వర్

**ప్రజాపక్షం/బోడుప్పల్:** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా తరగతులు నిర్వహిస్తున్న నైన్ ఎడ్యుకేషన్ కళాశాల ముందు శనివారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి అన్వర్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ఇంటర్ కళాశాలలు ఎలాంటి ఇంటర్ బోర్డు అనుమతులు లేకున్నా, ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా, విద్యార్థులను చేర్చుకొని, వారి జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయి. నైన్ ఎడ్యుకేషన్ కళాశాలకు ఎటువంటి గుర్తింపు లేకున్నా విద్యార్థులను చేర్చుకొని, వారిని వారి తల్లితండ్రులను మోసం చేస్తున్నారని, ఇప్పటికే వారి నుండి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేసి, అక్రమంగా తరగతులు నిర్వహిస్తున్నారని కళాశాల యాజమాన్యం పై మండిపడ్డారు. కాబట్టి విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో ఉండే అవకాశం వునందున తక్షణమే ఇంటర్ విద్యాధికారులు నైన్ ఎడ్యుకేషన్ కళాశాలను తనిఖీ చేసి, యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకొని విద్యార్థుల భవిష్యత్తు కాపాడాలని డిమాండ్ చేస్తున్నాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కృష్ణ, సాయి కుమార్, శ్రీకాంత్, సాయి ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



## మత్తు పదార్థాలపై అవగాహన

**ప్రజాపక్షం/చర్లపల్లి:** కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం జెడ్‌పిహెచ్‌ఎస్ గోరంట్ల పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్త రాచకొండ ప్రభాకర్ ప్రజలు, యువతకు గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలు, పొగాకు ఉత్పత్తులు సేవించడం వల్ల కలిగే నష్టాలు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నో డ్రగ్స్ సేవ్ లైఫ్ అంటూ కరపత్రాలు పంచుతూ ఫ్లెక్సిలు, మైక్‌సెట్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, యువత, కీసర పోలీస్ స్టేషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## గంజాయి విక్రయిస్తున్న యువకుడి అరెస్ట్

**ప్రజాపక్షం/ఉప్పల్ :** గుట్టు చప్పుడు కాకుండా గంజాయి విక్రయిస్తున్న ఓ యువకుడిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి 4.2 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొన్నారు. ఎక్సైజ్ ఇనస్పెక్టర్ ఓంకార్ తెలిపిన వివరాల ప్రకారం ఉప్పల్ నల్లచెరువు కట్ట బస్‌స్టాప్ వద్ద తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన షంషీర్ అలీఖాన్(32)ను అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా ప్యాక్ చేసిన నాలుగు గ్రాముల చొప్పున ఉన్న 1012 గంజాయి ప్యాకెట్లతో పాటు ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకొన్నారు. నారపల్లిలోని ఒక ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పని చేసే అతడు అధిక ఆదాయం కోసం గత కొద్ది కాలంగా నాగ్‌పూర్ నుండి గంజాయి తీసుకొని వచ్చి స్థానిక వినియోగదారులకు విక్రయిస్తున్నాడని విచారణలో తేలింది. నిందితుడిపై గంజాయికి సంబంధించిన కేసు బీబీనగర్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైందని తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## వివాహిత ఆత్మహత్య...అనుమానం వ్యక్తం చేస్తున్న కుటుంబ సభ్యులు



**ప్రజాపక్షం/చర్లపల్లి:** వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కుషాయిగూడ చక్రీపురంలో నివాసముండే మల్లిఖార్జున్ ఆరు సంవత్సరాల క్రితం ధరావత్ ప్రవల్లిక(26)ను ప్రేమ వివాహం చేసుకున్నాడు. చక్రీపురంలో అద్దెకు ఉంటున్నారు. ప్రవల్లికకు గైనకాలజీ సంబంధిత ఆరోగ్య సమస్య ఉండడంతో సంతానం కలుగకపోవడంతో చికిత్స తీసుకుంటున్నారు. శుక్రవారం ప్రవల్లిక తన చేతిని కోసుకుని ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకోగా ఆమెను మల్కాజ్‌గిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతి చెందారు. తమ కుమార్తె మృతికి ఒక డ్రైవర్ కారణం కావచ్చునని అనుమానం వ్యక్తం చేస్తూ పిఎస్‌లో తండ్రి ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



## క్రీడా సామగ్రి అందజేత

**ప్రజాపక్షం/జవహర్‌నగర్:** క్రీడా పోటీల్లో యువత తగు శిక్షణ పొందుతూ జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారుల స్థాయికి ఎదగాలని బిఆర్‌ఎస్ పార్టీకి చెందిన యువ నాయకుడు దిలీప్ అన్నారు. జవహర్‌నగర్ శాంతినగర్‌లో అతడు శనివారం యువత క్రీడా శిక్షణ నిమిత్తం వాలీబాల్‌కు సంబంధించి క్రీడా సామగ్రి, వాలీబాల్ కిట్‌ను ఉదార స్వభావంతో అందించారు. విద్యతో పాటు విద్యార్థులు చిన్నతనం నుండే క్రీడల వంటి ఇతర అంశాల్లోనూ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పిల్లలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారి ఆసక్తికి అనుగుణంగా ప్రోత్సహించాలని సూచించారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో భారీ స్కామ్

* రైతుల ధాన్యంలో భారీగా కోతలు విధిస్తూ, సంతకాలను ఫోర్జరీ చేస్తూ బిల్లులు దండుకుంటున్న నిర్వాహకులు
* జగ్గంగూడ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో బయటపడిన నిర్వాహకుల బాగోతం
* న్యాయం చేయాలని ఆందోళన వ్యక్తం చేసిన రైతులు



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే ధాన్యం బ్యాగుల్లో భారీగా కోతలు విధిస్తు నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్న బాగోతం శనివారం బట్టబయలైంది. మూడుచింతలపల్లి మండలం జగ్గంగూడలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యాన్ని విక్రయించారు. రైతులు తూకం వేసిన ధాన్యం బస్తాల రశీదు ఒకలాగ ఉంటే ట్రక్ షీట్‌లో మరో విధంగా నమోదు చేస్తు రైతుల పొట్టకొడుతున్నారు. ఇటీవల జగ్గంగూడలో ఓ లారీని ధాన్యం బస్తాలతో లోడ్ చేయగా సుమారు 810 బ్యాగులు మిల్లర్లకు తరలించారు. మిల్లర్ల వద్ద తూకం వేసి ఓ లారీ లోడ్‌లో సుమారు 33 బ్యాగులు కోత విధిస్తే కొనుగోలు కేంద్రం నిర్వాహకులు చేతివాటం ప్రదర్శించి 63 బ్యాగులు కోత విధించినట్లు లెక్కల్లో చూపడంతో కేంద్రం నిర్వాహకుల బాగోతం వెలుగులోకి వచ్చింది. రైతుల సంతకాలను ఫోర్జరీ చేస్తు చదువురాని రైతుల సంతకాలను ఇంగ్లీష్‌లో సంతకం చేస్తు ఇష్టానుసారంగా బిల్లులు చేస్తున్నారని రైతులు ఆరోపించారు. అలియాబాద్ ధాన్యం కొనుగోలు కేంద్రం ఇంచార్జ్ విజయ్ ఆదేశాలతో చేస్తున్నట్లు జగ్గంగూడ ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకుడు రాము తెలిపాడు.

ఇంత జరుగుతున్న అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదంటు దీంట్లో అధికారుల చేతివాటం ఉందని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని జిల్లా ఉన్నతాధికారులు చెబుతున్నప్పటికి రైతులకు జరుగుతున్న అన్యాయంపై అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నా రు. రైతుల నుండి ధాన్యం మిల్లర్లకు చేరే సరికి తూకంలో భారీగా తేడాలు వస్తున్నాయని దీంతో రైతులకు అన్యాయం జరుగుతుందని వాపోతున్నారు. రైతుల సంతకాలను ఫోర్జరీ చేసి రశీదులపై సంతకాలు చేస్తు ఒటిపిలు చెప్పించుకుని రైతుల ఖాతాల్లో వారికి రావాల్సిన సరైన డబ్బులను వేయడం లేదని రైతులు ఆరోపించారు. ఇప్పటికైన జగ్గంగూడ కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న భారీ స్కామ్‌ను ఉన్నతాధికారులు విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు విష్ణువర్ధన్‌రెడ్డి, వీరేశం, ప్రహ్లాద్, సత్తయ్య, శ్రీకాంత్‌రెడ్డి, సురేష్ తదితర రైతులు పాల్గొన్నారు.

## ‘నా ఊరు యాది జేస్తుంది’ పుస్తకాన్ని ఆవిష్కరించిన డిసిసి

### పుస్తక రచయిత మేడోజి బాల్‌రామ్‌చారీని అభినందించిన డిసిసి తోటకూర వజ్రేష్‌యాదవ్



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** గ్రామంపై ఉన్న ప్రేమతో పుస్తక రచన చేయడం అభినందించదగిన విషయమని జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. శనివారం మూడుచింతలపల్లి మండలం కేశవరం గ్రామానికి చెందిన ప్రముఖ కవి మేడోజి బాల్‌రామ్‌చారి నా ఊరు యాది జేస్తుంది అనే పుస్తకాన్ని రచించగా ఆ పుస్తకాన్ని డిసిసి తోటకూర వజ్రేష్‌యాదవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె వాతావరణం ప్రశాంతంగా ఉంటుందని గ్రామీణ వాతావరణంలో పుట్టి పెరగడం చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటు ఆ దృశ్యాలను పుస్తక రూపంలో రచించడం గొప్ప విషయమని చెప్పారు. రాబోయే తరాలకు అలనాటి గ్రామీణ సాంస్కృతి, సాంప్రదాయలను గుర్తుచేస్తు పుస్తకాన్ని ప్రచురించడం శుభ పరిణామమని అన్నారు. పుస్తక రచయిత మేడోజి బాల్‌రామ్ చారీ ని శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహా యాదవ్, అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమతం శిరీషా కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు బొమ్మలపల్లి మల్లేష్‌యాదవ్, కొంపల్లి మాధవి భూమేష్‌గౌడ్, మామిండ్ల మల్లేష్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.




## ఇన్‌స్పెక్టర్‌ను సన్మానించిన ఆర్‌టిఐ మెంబర్ జైపాల్‌రెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు నూతనంగా విచ్చేసి న ఇన్స్‌పెక్టర్ కొండ నర్సింహారెడ్డిపి మేడ్చల్ జిల్లా ఆర్‌టిఐ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి శనివారం మర్యాదపూర్వకరంగా కలిశారు. ఈ సందర్భంగా ఇన్స్‌పెక్టర్ కొండ నర్సింహారెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులకు తక్షణమే పరిష్కార మార్గం చూపుతు శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఇన్స్‌పెక్టర్ కొండ నర్సింహారెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి బాలేష్, మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వైఎస్ గౌడ్, మాజీ సర్పంచ్ యాదగిరి, మేడ్చల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.రమేష్, ఆనంద్, ఆర్. శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు

### ఎమ్మెల్యే కెపి. వివేకానంద్

**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ సర్కిల్ పరిధి బౌరంపేటలోని లహరి గ్రీన్ పార్క్ లో సుమారు కోటి రూపాయల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను బిఆర్‌ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ పరిశీలించారు. ఈ సందర్భంగా బిఆర్‌ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా విస్తరిస్తున్న పట్టణీకరణకు అనుగుణంగా ప్రాధాన్యత క్రమంలో మౌలిక వసతులను కల్పిస్తూ గత 12 ఏళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పరిచామని, రానున్న రోజుల్లో కూడా నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి పరుస్తామన్నారు. ఈ సందర్భంగా లహరి గ్రీన్ పార్క్ ప్రధాన రహదారి నిర్మాణ పనులను వెంటనే చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నాచారం సునీతా మురళి యాదవ్, పల్పునూరి విష్ణువర్ధన్ రెడ్డి, అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ వెలగపూడి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## వేరుశనగ విత్తనాల గోల్‌మాల్‌పై వ్యవసాయ అధికారుల్లో ఒకరు సస్పెన్షన్

**ప్రజాపక్షం /దౌల్తాబాద్ :** వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలో రైతులకు ఉచితంగా పంపిణీ చేయాల్సిన వేరుశనగ విత్తనాలను అమ్ముకున్న వ్యవసాయశాఖ అధికారులపై విచారణ అనంతరం దుద్యాల మండలం ఎఒపై సస్పెన్షన్ వేటు, మెట్లకుంట ఎఇఒ సర్వీస్ నుండి తొలగింపు, గోపస్లాబాద్ ఎఇఒ ను సర్వీస్ నుండి తొలగించారు. కొడంగల్ వ్యవసాయ శాఖ ఏడి ని కలెక్టర్‌ఆదేశాల మేరకు వ్యవసాయశాఖ ప్రధాన కార్యాలయానికి అటాచ్ చేశారు. సస్పెన్షన్ ఉత్తర్వులను జిల్లా వ్యవసాయ అధికారి రాజరాత్నం జారీ చేశారు.

## కాంగ్రెస్‌తోనే దేశానికి స్వాతంత్ర్యం

### తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి



**ప్రజాపక్షం/తాండూరు:** కాంగ్రెస్ పార్టీతోనే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. తాండూరు పట్టణం పరిధి శ్రీకన్వేషన్ హాల్‌లో ఎంఎల్‌ఎ మనోహర్‌రెడ్డి ఆధ్వర్యాన శనివారం రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ (ఆర్‌జిపిఆర్‌ఎస్)పై సర్పంచ్‌లకు అవగాహనతో పాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిందని, తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనే అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుండి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు రాష్ట్రంలో అమలవుతున్నాయని అన్నారు. అధికారంలోకి వచ్చిన రెండున్నర సంవత్సర కాలంలోనే గ్రామాల అభివృద్ధికి కృషి చేశామన్నారు. పదవిని ఒక బాధ్యతగా భావించి నమ్మకంతో గెలిపించిన ప్రజల కోసం పనిచేయాలని సూచించారు. 12యేండ్లలో బిజెపి ప్రభుత్వం పేదలకు చేసిందేమి లేదని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వ పాలనలో పెద్దలకు మాత్రమే మేలు చేస్తుందన్నా రు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు రాష్ట్రంలో అమలవుతున్నాయని అన్నారు. గ్రామాల అభివృద్ధికి పూర్తి సహకారం అందజేస్తానని అన్నారు. అందుకు గాను తాండూరు క్యాంపు కార్యాలయంలో వారానికి 4రోజులు అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా సర్పంచ్‌లకు, నాయకులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమం లో డిసిసి అధ్యక్షులు ధారాసింగ్‌నాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజబాల్ రెడ్డి, తాండూరు మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ నర్సిములు, రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన ఇంచార్జీ సుభాష్, శిక్షకులు రాము, సతీష్, జాఫర్, పట్టణ పార్టీ అధ్యక్షులు బాతుల నాగరాజు, మండల పార్టీ అధ్యక్షులు మహిపాల్ రెడ్డి, రాజ్‌కుమార్, తదితరులు ఉన్నారు.




## కార్మిక సమస్యల పరిష్కారానికి పోరాటమే ఏకైక మార్గం

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలంటే పోరాటమే ఏకైక మార్గమని మున్సిపల్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె రవిచంద్రన్ అన్నారు.మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఘట్‌కేసర్ సర్కిల్ కార్మికుల సదస్సు శనివారం ఘట్‌కేసర్ మహిళా భవన్‌లో నిర్వహించారు.ఈ సందర్భంగా రవిచంద్రన్ మాట్లాడుతూ మున్సిపాలిటీల నుంచి మహా నగర పాలక సంస్థల్లో విలీనమైన కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనంగా రూ.26వేల జీతం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పదవీ విరమణ చేసిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు వారసత్వ ఉద్యోగాలు ఇవ్వాలని, విధి నిర్వహణలో మృతి చెందిన లేదా అనారోగ్యానికి గురైన కార్మికుల కుటుంబాలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. ఉద్యోగ భద్రతతో పాటు జనాభాకు అనుగుణంగా సిబ్బంది సంఖ్యను పెంచాలని సూచించారు. కొన్ని సర్కిళ్లలో పారిశుద్ధ్య, నీటి సరఫరా విద్యుత్ సిబ్బందికి రావాల్సిన వేతనాల్లో కోతలు విధించడం అన్యాయమని పేర్కొంటూ హాజరు వివరాలు పరిశీలించి పూర్తి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పండుగ సెలవులు, సాధారణ సెలవులు కూడా కార్మికులకు అమలు చేయాలని కోరారు. మున్సిపల్ కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ ఈనెల 23, 24 తేదీల్లో రంగారెడ్డి జిల్లా కాటేదాన్‌లో జరిగే తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ సిబ్బంది ఔట్‌సోర్సింగ్ కార్మికుల సంఘం నాలుగో మహాసభల్లో కార్మిక సమస్యలపై చర్చించి భవిష్యత్ పోరాట కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం సీనియర్ నాయకులు కల్లూరి జయచంద్ర, మండల కార్యదర్శి లొట్టి ఈశ్వర్, సర్కిల్ అధ్యక్షురాలు సువర్ణ, శ్రీరాములు, దాసు, అశోక్, అరుణ,లక్ష్మి , తదితరులు పాల్గొన్నారు.



## భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

**ప్రజాపక్షం/బోడుప్పల్ :** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని చెంగిచెర్ల డివిజన్ శ్రీ లక్ష్మీ నగర్ కాలనీలో మున్సిపల్ సాధారణ నిధులతో నిర్మిస్తున్న నూతన భూగర్భ డ్రైనేజీ పనులను మేడ్చల్ జిల్లా బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ కాలనీ వాసులతో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కొత్త కిషోర్ గౌడ్ మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని, వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా నూతన డ్రైనేజ్ పైప్‌లైన్ పనులు ప్రారంభించామని, యుద్ధ ప్రాతిపదికన డ్రైనేజీ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త చందర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొత్త ప్రభాకర్ గౌడ్, సీనియర్ నాయకులు కుర్రి శివశంకర్ శ్రీ లక్ష్మీ నగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు సందీప్,కాలనీ అసోసియేషన్ సభ్యులు, డివిజన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## హత్యాయత్నం కేసులో 14 మంది నిందితులు అరెస్టు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** హత్యాయత్నం కేసులో పద్నాలుగు మంది నిందితులను అరెస్టు చేసిన సంఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సిఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని చీర్యాల గ్రామం సర్వే నంబర్ 156 వివాదాస్పద భూమి వద్దకు చేరుకుని అక్కడ విధులు నిర్వహిస్తున్న వాచ్‌మెన్ గోదుగు సాయికుమార్, బాధితులు, సాక్షులపై ఇనుప రాడ్లు, సుత్తెలు, కర్రలు, రాళ్లతో దాడిచేసిన పదహారు మందిలో ప్రధాన నిందితులు ఏ1 పల్లె భద్రారెడ్డి, ఏ2 బొల్లంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఏ3 పంజా సంజయ్‌కుమార్ 7వ తేదీన అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించగా శనివారం పద్నాలుగు మందిని అరెస్టు చేశారు.ఈ ఘటనలో గాయపడిన బాధితుల వాంగ్మూలాలు, ప్రత్యక్ష సాక్షుల ప్రకటనలు, స్వాధీనం చేసుకున్న వస్తువులు ఇతర సాంకేతిక ఆధారాల ప్రకారం అరెస్టుచేసి గౌరవ న్యాయస్థానం ముందు హాజరుపర్చామని తెలిపారు.ఈ కేసులో సమగ్ర దర్యాప్తు నిర్వహించిన జవహర్ నగర్ ఏసిపి చక్రపాణి, కీసర సిఐ ఆంజనేయులు, దర్యాప్తు అధికారి ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి. సిబ్బందిని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్రీధర్ అభినందించారు.



## వేతన సవరణ అమలుకు ప్రత్యేక సమావేశం

**ప్రజాపక్షం/వికారాబాద్ :** 2021సంవత్సరం జులై1నుండి వేతన సవరణ అమలు ఉద్యోగులకు డిపో మేనేజన్ హామీ కొరకై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎండి ఆదేశాల మేరకు వికారాబాద్ ఆర్‌టిసి డిపోలో డిపో మేనేజర్ నమ్రత ఉద్యోగులతో ప్రత్యేక మీటింగ్ నిర్వహించారు. ఇటీవల జరిగిన సమ్మె నేపథ్యంలో ప్రభుత్వం యాజమాన్యంతో కుదిరిన ఒప్పదంలోని మూడు ప్రధాన డిమాండ్లపై డిపో మేనేజర్ స్పష్టత నిచ్చారు. 2021కుసంబంధించిన వేతన సవరణ జూన్ మాసంలోనే అమలు చేయడం జరుగుతుందని అందుకు అనుగుణంగా జులై1నుండి ఉద్యోగులు కొత్త వేతనాలు అందుకొనున్నారని డిపో మేనేజర్ తెలిపారు. గుర్తింపు యునియన్ ఎన్నికల అనంతరం, గుర్తింపు పొందిన సంఘం, డైరెక్టర్, యాజమాన్యం కృషి చేస్తామని భరోసా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సురేందర్, నరసింహులు, పెంటయ్య నాయక్, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బంట్వారం పోలీస్ స్టేషన్ సందర్శించిన డిఎస్‌పి అంజయ్య

**ప్రజాపక్షం/బంట్వారం :** బంట్వారం పోలిస్టేషన్‌కు వికారాబాద్ డిఎస్పీ అంజయ్య శనివారం సందర్శించారు. కార్యక్రమంలో బాగంగా ఆయన స్టేషన్లలో ఉన్న పలు రికార్డులు, క్రైమ్ రిజిస్టర్‌లు, పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. మండల పరిధిలో ఉన్నటువంటి రౌడి షీటర్లను, అనుమానితులను ఠాణాకు పిలిపించి వారి ప్రవర్తన గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజలతో, గ్రామాల్లో ఉన్న స్నేహితులతో మంచి ప్రవర్తన కలిగి స్నేహపూర్వకంగా ఉండాలని వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. గత ఆరు మాసాలుగా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను సేకరించి బాధితులకు అందజేశారు.
ఈ కార్యక్రమంలో బంట్వారం స్థానిక ఎస్ఐ పి. విమల, సిబ్బంది ఉన్నారు.

## 5వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం: ప్రిన్సిపల్ సంగమేశ్వర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గురుకుల పాఠశాలల్లో విద్యాలయాల్లో విద్యను అభ్యషించాలకుంటున్న మైనారిటీ, నాన్ మైనార్టీలకు విద్యార్థులకు 2026 27 విద్యా సంవత్సరానికి గాను ఏలాంటి రాత పరీక్షలు లేకుండానే అర్హులైన 5వ తరగతి విద్యార్థులకు హయత్‌నగర్‌లోని తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ స్కూల్, అంబర్‌పేట్ బాయ్స్1లో మైనారిటీ, నాన్‌మైనారిటీ విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఈ.సంగమేశ్వర్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ప్రతిష్టాత్మక విద్యాసంస్థలో నాణ్యమైన విద్య, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల బోధన, క్రమశిక్షణతో కూడిన విద్యా వాతావరణం, ఆధునిక సౌకర్యాలు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయని ప్రిన్సిపల్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు అవసరమైన ధృవపత్రాలతో నేరుగా పాఠశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అర్హులైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సకాలంలో ప్రవేశాలు పొందాలని ప్రిన్సిపాల్ ఈ.సంగమేశ్వర్ విజ్ఞప్తి చేశారు.

## కూలిన ఇల్లు.. తప్పిన ప్రమాదం

ఆశ్రయం కల్పించాలంటున్న బాధితుడు వెంకటయ్య



**ప్రజాపక్షం/కొందుర్గు:** కురుస్తున్న వర్షాలకు ఇల్లు కూలిపోవడంతో తృటిలో ప్రమాదం తప్పిందని బాధితుడు లింగని వెంకటయ్య తెలిపారు. శుక్రవారం రాత్రి జిల్లేడు చౌదరిగూడ మండల పరిధిలోని గుర్రంపల్లి గ్రామంలో కురిసిన వర్షానికి మట్టి ఇల్లు కూలిపోవడంతో అది చూసిన బాధితుడు లింగని వెంకటయ్య బోరున విలపించారు. రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబం తనదని, తన కుటుంబానికి సొంత ఇల్లు లేకుండా పోయిందని, ప్రభుత్వం తక్షణమే స్పందించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసేందుకు కృషి చేయాలని కోరారు. గతంలో అనేక మార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్ళి తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని వేడుకున్న ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి మట్టి ఇల్లు కూలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పంధించిన తనకు ఆశ్రయం కల్పించేందుకు కృషి చేయాలని కోరారు.

## రైతులకు ఎరువుల వినియోగంపై శాస్త్రీయ అవగాహన కల్పించాలి

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** రైతులకు ఎరువుల వినియోగంపై శాస్త్రీయ అవగాహన కల్పించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. శనివారం నందిగామలో రంగారెడ్డి జిల్లా వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో అన్నదాతలు పత్తి, వరి, మొక్కజొన్న పంటలకు ఏ స్థాయిలో ఎరువులు వినియోగిస్తారో తెలియకుండా వాడుతున్నారని వివరించారు. ఎరువుల వినియోగంపై పూర్తి స్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. యూరియా లభించదేమోనన్న భయంతోనే ఉన్నదాని కంటే ఎక్కువగానే వినియోగిస్తున్నారని గుర్తు చేశారు. రైతుల్లో వస్తున్న ఆందోళనలను దూరం చేసేందుకు అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించేందుకు అధికారులు కృషి చేయాలని పేర్కొన్నారు. గ్రామానికి ముగ్గురు ఆదర్శ రైతులను ఎంపిక చేసి యాప్ వినియోగంపై ముందస్తుగా శిక్షణ ఇవ్వాలని, దాంతో సామాన్య రైతులకు ఎరువుల కొనుగోలుపై సహయ పడుతారని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అడిషనల్ డైరెకర్లు కె.విజయ్‌కుమార్, బి.నరసింహారెడ్డి, ఏడిఏలు మాధవి, సత్యంబాబు, ఏడీఎస్ శైలజతోపాటు రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఏడిఏస్ అధికారులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా రైతులకు ఎరువులు అందించాలన్నదే లక్ష్యం

వ్యవసాయ శాఖ రాష్ట్ర అదనపు డైరెక్టర్ విజయ్‌కుమార్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పారదర్శకంగా అన్నదాతలకు ఎరువులు పంపిణీ చేయాలన్నదే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని వ్యవసాయ శాఖ రాష్ట్ర అదనపు డైరెక్టర్ విజయ్‌కుమార్ వివరించారు. శనివారం షాద్‌నగర్, కొత్తూరు పట్టణాల్లో ఉన్న వివిధ ఫర్టిలైజర్ షాపులను స్థానిక వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. యాప్ పనితీరును, డీలర్ల వద్ద అమలవుతున్న విధానాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.



ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అదనపు డైరెక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎరువుల కొనుగోలు చేయడంలో అన్నదాతలు పడుతున్న ఇబ్బందులను దూరం చేయడంతోపాటు అక్రమంగా విక్రయిస్తున్న ఎరువుల నియంత్రణపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఎరువుల కోసం రైతులు క్యూలైన్లలో వేచి ఉండటం, బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయించడం వంటి అనేక సంఘటనలపై విస్తృతంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

రైతులు షాపుల వద్దకు రావాల్సిన పని లేదని, ఇంటి వద్దనే ఉంటూ యాప్ ద్వారా ఎరువులను బుక్ చేసుకోవచ్చునని వివరించారు. పైలట్ ప్రాజెక్టు క్రింద రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలతోపాటు తెలంగాణ రాష్ట్రంలోని ఐదు జిల్లాను ఎంపిక చేసి అమలు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు, డీలర్ల నుండి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. యాప్ వినియోగం పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే ఎరువుల కొనుగోలు సులభతరం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ తనిఖీల్లో రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారిణి శైలజ, వ్యవసాయ శాఖ ఏడిఏస్‌లు సత్యంబాబు, మాధవి, షాద్‌నగర్ ఏడిఏ రమాదేవిలు ఉన్నారు.

# భారీ వర్షానికి అప్రమత్తమైన హైడ్రా

అర్ధరాత్రిలోపు 26 చెట్లు తొలగింపు

వాటర్ లాగింగ్ ప్రాంతాల్లో వేగవంతమైన చర్యలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శుక్రవారం రాత్రి నగరంలో కురిసిన భారీ వర్షాలకు హైడ్రా డిఆర్‌ఎఫ్ బృందాలు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టాయి. ఈదురు గాలుల కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో చెట్లు నేలకూలగా, వాటర్ లాగింగ్ సమస్యలు తలెత్తిన ప్రాంతాల్లో కూడా అత్యవసర చర్యలు చేపట్టారు. రాత్రి 11.30 గంటల వరకు 26 చెట్లు నేలకూలినట్లు ఫిర్యాదులు అందగా, వాటిలో 21 చెట్లను అర్ధరాత్రిలోపే తొలగించారు. మెహిదీపట్నం, అత్తాపూర్ ప్రాంతాల్లో నీటి నిల్వలను తొలగించి రాకపోకలు సజావుగా కొనసాగేలా చర్యలు తీసుకున్నారు. బంజారాహిల్స్ రోడ్ నెంబర్1 లోని వెంగళరావు పార్కు సమీపంలో కూలిన చెట్లను తొలగించి నిమ్స్ ఆసుపత్రికి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. మంగళవారం భారీ వర్షాలకు వరదలు వచ్చిన కొండాపూర్, మియాపూర్, రాయదుర్గం మెట్రో స్టేషన్, గచ్చిబౌలి బయోడైవర్సిటీ ప్రాంతాల్లో ముందుగానే పూడిక తొలగింపు పనులు చేపట్టడంతో శుక్రవారం వర్షాల సమయంలో నీటి నిల్వలు ఏర్పడలేదని అధికారులు తెలిపారు. నార్సింగి మెయిన్ రోడ్ ఇందిరా పార్క్ స్టీల్ బ్రిడ్జి తదితర ప్రాంతాల్లో కూడా చెత్త, అడ్డంకులను తొలగించి నీటి ప్రవాహాన్ని సాఫీగా కొనసాగేలా చేశారు. వర్షం కురుస్తున్న సమయంలోనే క్షేత్రస్థాయిలో పనిచేసిన డిఆర్‌ఎఫ్ బృందాలు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టామని హైడ్రా అధికారులు చెప్పారు.

**హైడ్రా సహాయక చర్యల్లో బైక్ టీమ్‌ల కీలక పాత్ర**

వర్షాకాలంలో అత్యవసర సహాయక చర్యలను మరింత వేగవంతం చేసేందుకు హైడ్రా బైక్ టీమ్‌లను సమర్థవంతంగా వినియోగిస్తోంది. మొత్తం 20 బైకులతో మూడు షిఫ్టుల్లో 60 మంది సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్నారు. డిఆర్‌ఎఫ్ వాహనాలు చేరుకోలేని ప్రాంతాల్లో బైక్ టీమ్‌లు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపడుతున్నాయి. ప్రతి బైక్కు ప్రత్యేక బాక్స్ అమర్చి, అందులో బ్యాటరీతో పనిచేసే రెండు చైన్సాలు, తాళ్లు, ఇతర అవసరమైన పరికరాలు ఏర్పాటు చేశారు. చెట్లు కూలిన సందర్భాల్లో కొమ్మలను కత్తిరించి, చెట్లను రహదారుల నుంచి తొలగించేందుకు వీటిని వినియోగిస్తున్నారు. ట్రాఫిక్ జాములు ఉన్నప్పటికీ బైక్‌ల ద్వారా వేగంగా చేరుకునే వీలుండటంతో అత్యవసర స్పందన సమయం గణనీయంగా తగ్గుతోంది. చెట్లు కూలిన సందర్భాల్లోనే కాకుండా వాటర్ లాగింగ్ ప్రాంతాల్లో కూడా గడ్డపారలు, ఇతర పరికరాలతో చేరుకుని



నీటి ప్రవాహానికి ఆటంకాలు తొలగిస్తున్నారు. ఇటీవల బంజారాహిల్స్ రోడ్ నెంబర్1లో వరుసగా మూడు చెట్లు కూలిన సందర్భంలో డిఆర్‌ఎఫ్ ట్రక్కులు చేరుకునేలోపు బైక్ టీమ్‌లు అక్కడికి చేరుకుని చెట్లను తొలగించి ట్రాఫిక్కు అంతరాయం లేకుండా చేశాయి. నిమ్స్ మిలీనియం బ్లాక్‌పై పడిన చెట్లను కూడా కిటికీల ద్వారా చేరుకుని తొలగించడం ద్వారా తమ సామర్థ్యాన్ని చాటాయి. నగరంలో మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్‌లు, డిఆర్‌ఎఫ్ బృందాలు, స్టాటిక్ టీమ్లతో సమన్వయంగా పనిచేస్తున్న బైక్ టీమ్‌లు ప్రస్తుతం హైడ్రా అత్యవసర స్పందన వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అధికారులు తెలిపారు.

# సమగ్ర పరిపాలనా కేంద్రంగా.. ఎంఎంసి ప్రధాన కార్యాలయ నిర్మాణం

కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సమగ్ర పరిపాలనా కేంద్రంగా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) ప్రధాన కార్యాలయాన్ని నిర్మించాలని కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి అన్నారు. ఉప్పల్ భగాయత్‌లో నిర్మించనున్న నూతన ప్రధాన కార్యాలయ భవన స్థలాన్ని ఎంఎంసి కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాల ఉన్నతాధికారులతో కలిసి ఆయన కేటాయించిన స్థల పరిస్థితులను, భవన నిర్మాణానికి అవసరమైన ప్రాథమిక అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అధునాతన హంగులతో నూతన భవన నిర్మాణ ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. దీనికోసం అనుభవజ్ఞులైన ఆర్కిటెక్ట్‌లతో సంప్రదించి, సమగ్ర ప్లాన్‌లను రూపొందించాలన్నారు. కేవలం కార్యాలయ అవసరాలకే పరిమితం కాకుండా, ప్రజా సౌకర్యం, విశాలమైన పార్కింగ్, సమావేశ మందిరాలు, డిజిటల్ సేవల కేంద్రాలు, ఇతర ఆధునిక మౌలిక వసతులతో ఈ భవనాన్ని తీర్చిదిద్దాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని వాటర్ బోర్డు, హైడ్రా వంటి ప్రభుత్వ అనుబంధ సంస్థలకు అవసరమైన కార్యాలయ స్థలాన్ని భవన ప్లానింగ్‌లోనే ముందుగానే గుర్తించాలని కమిషనర్ స్పష్టం చేశారు. అన్ని శాఖలు సమన్వయంతో ఒకే చోట పనిచేసేలా దీనిని ఒక సమగ్ర పరిపాలనా కేంద్రంగా అభివృద్ధి చేయాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**నీటి నిల్వలు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి**

వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మలాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉందని కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి తెలిపారు. హస్తినాపురం, పంచాయతీ రాజ్ టీచర్స్ కాలనీ, రెడ్డి కాలనీ, సాగర్ ఎక్స్ రోడ్ బైరామల్‌గూడ, శిఖర ఎన్‌క్లేవ్, లక్ష్మి నరసింహపురం కాలనీ తదితర ప్రాంతాల్లో అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితులను సమీక్షించారు. హస్తినాపురంలోని పంచాయతీ రాజ్ టీచర్స్ కాలనీలో వర్షపు నీరు నిలిచే ప్రాంతాలు, డ్రైనేజీ వ్యవస్థ, స్టార్మ్ వాటర్ డ్రెయిన్‌ల అనుసంధానాన్ని పరిశీలించిన కమిషనర్, లోతట్టు ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను



ఆదేశించారు. డ్రైనేజీ కాలువల్లో పేరుకుపోయిన చెత్త, అడ్డంకులను వెంటనే తొలగించి వర్షాకాలానికి సంబంధించిన పనులను వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం సాగర్ ఎక్స్ రోడ్ రెడ్డి కాలనీలో నీటిముంపు సమస్యలు తలెత్తే ప్రాంతాలను పరిశీలించి, ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బైరామల్‌గూడలోని సాగర్ ఎన్‌క్లేవ్‌లో భూగర్భ మురుగునీటి వ్యవస్థ, స్టార్మ్ వాటర్ డ్రెయిన్‌ల పనితీరును పరిశీలించిన ఆయన, వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా డ్రైనేజీ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలన్నారు. ఈ సందర్భంగా రోడ్లు, ప్రజా ప్రదేశాల్లో వదిలివేసిన ఉపయోగంలో లేని కేబుల్ వైర్లను గమనించిన కమిషనర్, ప్రజల భద్రతకు ముప్పుగా మారుతున్న వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనుమతి లేకుండా వదిలిన కేబుళ్లను వెంటనే తొలగించాలన్నారు. శిఖర ఎన్‌క్లేవ్, పిఎన్‌ఆర్ కాలనీ ఫేజ్2, లక్ష్మి నరసింహపురం కాలనీలలో నాలాలు, స్టార్మ్ వాటర్ డ్రెయిన్లు, భూగర్భ మురుగునీటి వ్యవస్థలను పరిశీలించిన కమిషనర్, చెత్త, సిల్ట్ పేరుకుపోకుండా పూర్తిస్థాయిలో శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బైరామల్‌గూడ చెరువు ప్రాంతాన్ని సందర్శించిన ఆయన, చెరువు ఇన్‌లెట్, అవుట్‌లెట్ మార్గాలు, వాటితో అనుసంధానమైన నాలాలు, డ్రెయిన్‌ల పనితీరును సమీక్షించారు. వర్షపు నీరు చెరువులోకి చేరడం, బయటకు వెళ్లే మార్గాల్లో ఎలాంటి అడ్డంకులు లేకుండా నిర్వహణ చేపట్టాలని అధికారులకు సూచించారు.



## సైబరాబాద్‌లో మాన్సూన్ అప్రమత్తత

మల్కం చెరువు పరిసరాల్లో..

డిజిపి సి.వి.ఆనంద్, సిఎంసి కమిషనర్, సైబరాబాద్ సిపిల సంయుక్త తనిఖీలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వాతావరణ శాఖ భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో మాన్సూన్ సన్నద్ధత చర్యలను మరింత వేగవంతం చేస్తూ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) కమిషనర్ డాక్టర్ జి.సృజన, డిజిపి సి.వి. ఆనంద్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్‌లు మల్కం చెరువు పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. నీటి నిల్వలకు గురయ్యే ప్రాంతాలను పరిశీలించిన అధికారులు, వర్షపు నీటి పారుదల వ్యవస్థలు, అత్యవసర స్పందన ఏర్పాట్లు, వివిధ శాఖల సమన్వయ చర్యలను సమీక్షించారు. భారీ వర్షాల సమయంలో నీటి ప్రవాహం సజావుగా కొనసాగేలా చేపట్టిన పనుల పురోగతిని పరిశీలించారు. ఈ తనిఖీలలో మున్సిపల్, పోలీస్, ట్రాఫిక్, ఇంజినీరింగ్, మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలు, అర్బన్ బయోడైవర్సిటీ విభాగం అధికారులు పాల్గొన్నారు. సున్నిత ప్రాంతాల్లో చేపట్టిన నివారణ చర్యలను సమీక్షించిన అధికారులు, అవసరమైన చోట అదనపు చర్యలు చేపట్టాలని సూచించారు. నీటి నిల్వల ప్రాంతాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని కమిషనర్ ఆదేశించారు. మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలు యంత్రాలు, సిబ్బంది, అవసరమైన వనరులతో ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రజల భద్రత, ట్రాఫిక్ నిర్వహణ, అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన స్పందన కోసం అన్ని శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసినట్లు అధికారులు తెలిపారు.

# సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో.. టౌన్ ప్లానింగ్ అధికారుల బదిలీలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) పరిధిలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో భారీగా బదిలీలు, పోస్టింగ్‌లు జరిగాయి. పరిపాలనా కారణాల దృష్ట్యా అసిస్టెంట్ సిటీ ప్లానర్లు (ఎసిపి), టౌన్ ప్లానింగ్ అధికారులు (టిపిఓ), టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లకు (టిపిఎస్) సిఎంసి కమిషనర్ డాక్టర్ జి.సృజన బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

తెలంగాణ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం..సిఎంసిలో చేరిన అధికారులకు నూతన పోస్టింగ్‌లు ఇస్తూ, అలాగే ప్రస్తుతం విధుల్లో ఉన్న మరికొందరు అధికారులను బదిలీ చేస్తూ ఈ నిర్ణయం తీసుకున్నారు. బదిలీ అయిన అధికారులు తక్షణమే తమ కొత్త బాధ్యతలను స్వీకరించాలని కమిషనర్ ఆదేశించారు.

**బదిలీలు, పోస్టింగ్‌ల వివరాలు..**

బి. భాస్కర్ (టిపిఓ): మేడ్చల్ (సర్కిల్ 60), కుత్బుల్లాపూర్ జోన్ ఇన్‌చార్జ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా నియామకం.

ఎం. ప్రసాద్ (టిపిఓ): అమీన్‌పూర్ (సర్కిల్ 47), శేరిలింగంపల్లి జోన్ ఇన్‌చార్జ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్గా పోస్టింగ్.

ఎస్. హబీబున్నిసా (టిపిఓ): మాధాపూర్ (సర్కిల్ 50) ఇన్‌చార్జ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా నియమిస్తూనే, ఆల్విన్ కాలనీ (సర్కిల్ 51) అదనపు బాధ్యతలు అప్పగింత.

కె.సుష్మ (టిపిఓ): మియాపూర్ (సర్కిల్ 48) ఇన్‌చార్జ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా నియామకం, శేరిలింగంపల్లి (సర్కిల్ 49) అదనపు బాధ్యతలు.

ఇ.సురేందర్ రెడ్డి (ఎసిపి): కూకట్‌పల్లి (సర్కిల్ 52) ఏసీపీగా బదిలీ, మూసాపేట్ (సర్కిల్ 53) అదనపు బాధ్యతలు.

ఎ.కరుణాకర్ (ఎసిపి):చింతల్ (సర్కిల్ 54), కుత్బుల్లాపూర్ జోన్ ఎసిపిగా బదిలీ.

ఐ.రాణి (ఎసిపి):జీడిమెట్ల (సర్కిల్ 55) ఎసిపిగా బదిలీ, కొంపల్లి (సర్కిల్ 56) అదనపు బాధ్యతలు.

ఎం. ప్రసీద (ఎసిపి): నార్సింగి (సర్కిల్ 45) ఎసిపిగా బదిలీ, పటాన్‌చెరు (సర్కిల్ 46) అదనపు బాధ్యతలు.

ఎం.ఏ. జీషాన్ (ఎసిపి): కూకట్‌పల్లి జోన్ హెడ్ ఆఫీస్ ఏసిపిగా బదిలీ.

ఎ.భార్గవి సాయి (ఎసిపి): శేరిలింగంపల్లి జోన్ హెడ్ ఆఫీస్ ఎసిపిగా కొనసాగింపు.

ఆర్.సుమిత్ర (ఎసిపి): గాజులరామారం (సర్కిల్ 57) ఎసిపిగా యథావిధిగా కొనసాగింపు.

ఇ.శ్రీనివాస్ (ఎసిపి): దుండిగల్ (సర్కిల్ 59) ఎసిపిగా కొనసాగుతూ, నిజాంపేట్ (సర్కిల్ 58) అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారు.

టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లు (టిపిఎస్), ఇతర సిబ్బంది

పి.రమేష్ (టిపిఎస్): నార్సింగి (సర్కిల్ 45)కి బదిలీ, పటాన్‌చెరు (సర్కిల్ 46) అదనపు బాధ్యతలు.

బి.కిరణ్ కుమార్ రెడ్డి (టిపిఎస్): మూసాపేట్ (సర్కిల్ 53)కు బదిలీ, కూకట్‌పల్లి (సర్కిల్ 52) అదనపు బాధ్యతలు.

బి.మచేందర్ (టిపిఎస్): చింతల్ (సర్కిల్ 54) కు బదిలీ, జీడిమెట్ల (సర్కిల్ 55), కొంపల్లి (సర్కిల్ 56) అదనపు బాధ్యతలు.

బి.సరితాసేన్ (టిపిఎస్): గాజులరామారం (సర్కిల్ 57) కు బదిలీ.

జి.సాయి తేజ (డిఎంజిఆర్ 3): మేడ్చల్ (సర్కిల్ 60) కు బదిలీ.

ఎ.రోహన్ ఠాకూర్(టిపిబిఓ): అమీన్‌పూర్ (సర్కిల్ 47)లోనే కొనసాగింపు.

మహ్మద్ అక్బర్ (టిపిఎస్): శేరిలింగంపల్లి (సర్కిల్ 49)లో కొనసాగుతూ, మియాపూర్ (సర్కిల్ 48) అదనపు బాధ్యతలు.

యు.సంతోష్ కుమార్ (టిపిఎస్): మాధాపూర్ (సర్కిల్ 50)లో కొనసాగుతూ, ఆల్విన్ కాలనీ (సర్కిల్ 51) అదనపు బాధ్యతలు.

ముఖేష్ సింగ్ (టిపిఎస్): దుండిగల్ (సర్కిల్ 59) లో కొనసాగుతూ, నిజాంపేట్ (సర్కిల్ 58) అదనపు బాధ్యతలు.

సంబంధిత సర్కిల్ ఎసిపిలు తమ పరిధిలోని జోనల్ ఆఫీస్ పనులను కూడా పర్యవేక్షించాలని కమిషనర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ బదిలీ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని స్పష్టం చేశారు.

## ఈషా సింగ్‌కు ఘన సన్మానం




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అంతర్జాతీయ షూటింగ్ వేదికపై భారత కీర్తిని మరింత ఎత్తుకు చేర్చిన యువ షూటర్ ఈషా సింగ్‌కుహైదరాబాద్‌లో ఘన సన్మానం జరిగింది. జర్మనీలోని మ్యూనిక్‌లో నిర్వహించిన ఐఎస్‌ఎస్‌ఎఫ్ వరల్డ్ కప్ 2026 మహిళల 25 మీటర్ల పిస్టల్ విభాగంలో స్వర్ణ పతకం సాధించడంతో పాటు సరికొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పిన సందర్భంగా లైఫ్‌స్పాన్ వ్యవస్థాపకుడు, ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర రామ్ నంబుల ఈషా సింగ్‌ను ప్రత్యేకంగా సన్మానించారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ వైస్ ఛైర్మన్ , ఎండి. సోనిబాలాదేవి, తెలంగాణ, ఏపి రాష్ట్రాల బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేంద్ర రామ్ నంబుల మాట్లాడుతూ, ఈషా సింగ్ విజయం దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఆమె పట్టుదల, అంకితభావం, క్రమశిక్షణ యువతకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. భావితరాల క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తమ సంస్థ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. సన్మాన గ్రహిత ఈషా సింగ్ మాట్లాడుతూ, తన విజయ ప్రయాణంలో సహకరించిన కోచ్‌లు, కుటుంబ సభ్యులు, అభిమానులు, మద్దతుదారులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. యువ క్రీడాకారులు లక్ష్యసాధనలో ఏకాగ్రత, క్రమశిక్షణ, అంకితభావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. పట్టుదల, ఏకాగ్రత, క్రమశిక్షణే నా విజయానికి బలమైన పునాది అని ఆమె అన్నారు. కార్యక్రమంలో భారత షూటింగ్ రంగానికి విశేష సేవలందించిన ప్రముఖ కోచ్ జస్పాల్ రాణ కు ఘన నివాళులర్పించారు. ఆయన సేవలను స్మరించుకుంటూ ఒక నిమిషం మౌనం పాటించారు. ఈషా సింగ్ సాధించిన విజయం భారత షూటింగ్ చరిత్రలో మరో మైలురాయిగా నిలిచిందని పలువురు అభిప్రాయపడ్డారు.

# అర్హులైన ఓటర్ పేరు జాబితాలో నమోదు అయ్యేలా చూడాలి

బూత్ స్థాయిలో పార్టీ బలాన్ని పెంచడమే లక్ష్యంగా పనిచేయండి

తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల చైర్మెన్ వీర్లపల్లి శంకర్




**ప్రజాపక్షం/షాద్‌నగర్:** అర్హులైన ఓటర్ పేరును జాబితాలో నమోదు అయ్యేలా చూడాల్సిన బాధ్యత బిఎల్‌ఓలపై ఉందని తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల చైర్మెన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం షాద్‌నగర్ పట్టణంలోని సాయిరాజా పంక్షన్ హాల్‌లో బూత్ స్థాయి ఏజెంట్లకు (బిఎల్‌ఏలు) నిర్వహించిన శిక్షణ శిబిరానికి ప్రభుత్వ రంగ సంస్థల చైర్మెన్ వీర్లపల్లి శంకర్, టిపిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి యోగేశ్వర్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహ్మారెడ్డి, రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షురాలు జ్యోత్స్న చౌదరిలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల వ్యవస్థకు వెన్నుముక్కలగా బూత్ స్థాయి ఏజెంట్లు పనిచేయాలని, అర్హులైన ప్రతి వ్యక్తి పేరును ఓటర్ల జాబితాలో చేర్చేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రతి బూత్‌లో కాంగ్రెస్ బలాన్ని పెంచుకునేందుకు బూత్ స్థాయి ఏజెంట్లు చర్యలు తీసుకోవాలని, బూత్ స్థాయిలో విజయం సాధిస్తే రాష్ట్రంలో గెలిచినట్లే అవుతుందని వివరించారు. యువత, బడుగు బలహీన వర్గాలకు చెందిన అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటరు జాబితాలో చేర్పించేందుకు బిఎల్‌ఏలు కృషి చేయాలని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో ఇస్తున్న బిఎల్‌ఏ హ్యాండ్ బుక్‌ను పూర్తిగా అధ్యాయనం చేసి చట్టపరమైన నిబంధనలను, ఎన్నికల కమీషన్ మార్గదర్శకాలపై అవగాహన పెంచుకోవాలని పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా బూత్ స్థాయి ఏజెంట్లు పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ సమావేశంలో ఫరూక్‌నగర్ మండల అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్, మండలాల అధ్యక్షులు చంద్రశేఖర్, ఎల్లారం శేఖర్‌రెడ్డి, కుమార్ గౌడ్, పురుషోత్తంరెడ్డి, రమేష్, పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్, మున్సిపల్ చైర్మెన్ బసవేశ్వర్, వైస్ చైర్మెన్ అందె మోహన్, మార్కెట్ కమిటి చైర్ పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ నాయకులు జగదీశ్వర్ అప్ప, బాల్‌రాజ్ గౌడ్, ఉప్పరిగడ్డ సర్పంచ్ చందునాయక్‌తోపాటు వివిధ గ్రామాల బూత్ ఏజెంట్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మన బడిలో మన జ్ఞాపకాలు

**ప్రజాపక్షం/షాబాద్:** మన బడిలో మన జ్ఞాపకాలు, పూర్వ విద్యార్థుల సమ్మేళనం పున్నర్‌జన్మ సుకృతంగా బావిస్తున్నట్లు పూర్వ విద్యార్థులు ఆనంద బాష్పలతో సంతోషం వ్యక్తం చేశారు. 1975 నుండి ఇప్పటి వరకు చదువు చెప్పిన గురువులకు గౌవరప్రదమైన స్వాగతం పలుకుతూ కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం వివిధ బ్యాచిల నుండి పూర్వ విద్యార్థులు మాటాలడుతూ.. అప్పటి చదువులకు, ఇప్పటి చదువులకు తేడా గురించి, బాల్యం దశలో చదువుకుంటే జీవితం ఎలా ఉంటుందో పూర్వ విద్యార్థుల అనుభవం తెలియజేశారు. పాఠశాలలో చదివిన విద్యార్థులు పాఠశాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనుల ప్రారంభం

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :**మచ్చబొల్లారం డివిజన్‌లోని హనుమాన్‌టేకిడి ప్రాంతంలో రూ. 25 లక్షల విలువైన సిసి రోడ్డు పనులను శనివారం స్థానిక మాజీ కార్పొరేటర్ రాజ్ జితేందర్‌నాథ్ ప్రారంభించారు. గత కొద్ది కాలంగా ఇక్కడి అంతర్గత రోడ్లు తీవ్రంగా దెబ్బ తినటం వల్ల స్థానికులతో పాటు వాహనదారులు ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో తాను గతంలో అధికారులకిచ్చిన ప్రతిపాదనలతో పెండింగ్‌లో ఉన్న సిసి రోడ్డు పనులు ప్రారంభమయ్యాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు నిరుప, నీలవేణి, హేమలత, బుజ్జి, గణేష్, ఈశ్వర్, మహేష్, శ్రీనివాస్‌లతో పాటు కాంగ్రెస్ శ్రేణులు సురేందర్‌రెడ్డి, శ్రీశైలం, శ్రీనివాసగౌడ్, సర్వేష్ యాదవ్, కొండల్‌రెడ్డి, విజయనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## అదర్వ్ అద్భుత ప్రతిభ



ప్రజాపక్షం/బోరబండ: ఏకంగా రెండు వేల మంది పోటీ పడిన పాటల పోటీలో భరత్‌నగర్ వాసి అదర్వ్ 8 నుంచి 11 సంవత్సరాల వయసు కేటగిరీలో సెమీ ఫైనల్‌కు ఎంపికయ్యారు. ఈనెల 14న సాయంత్రం 9.30 గంటలకు ఈ కార్యక్రమం ఈటీవీలో ప్రసారమవుతుందని సంబంధీకులు తెలిపారు. ఇదిలాఉండగా ప్రముఖ సంఘసేవకుడు కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి, నోరా మ్యూజిక్ అకాడమీ డైరెక్టర్ నరేన్, అదనపు డైరెక్టర్ రజిని, చిన్నగల్ల అశ్విన్, రాజశేఖర్ తదితరులు అదర్వ్‌ను సన్మానించి, విజేతగా నిలవాలని ఆకాంక్షించారు.

## తాగునీటి సమస్య పరిష్కరించండి



ప్రజాపక్షం/వెంగళరావునగర్: ప్రజల తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని మాజీ కార్పొరేటర్ దేదీప్య అధికారులను కోరారు. ఈ మేరకు రహమత్‌నగర్ హనుమాన్ కమాన్‌గల్లీలో తీవ్ర మంచినీటి సమస్య నెలకొన్నదని స్థానికులు ఫిర్యాదు చేయడంతో దేదీప్య ఆ ప్రాంతంలో పర్యటించారు. మంచినీటి సరఫరాలో అంతరాయాలు, కలుషిత నీటి సరఫరా జరుగుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.

## మహిళా పైలట్‌కు వేధింపులు

ప్రజాపక్షం/సనత్‌నగర్: ఓ మహిళా పైలట్‌ను జిమ్ ట్రైనర్ సంతోష్‌గౌడ్ వేధించిన ఘటన వెలుగులోకి వచ్చింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడు సంతోష్‌గౌడ్‌పై సనత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. జిమ్ ట్రైనింగ్ పేరిట తనను లోబర్చుకునేందుకు యత్నించాడని.. తాను ఎదురుతిరగడంతో ఇన్‌స్టాలో తనపై అసభ్య మెసేజ్‌లు పెట్టారని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. సంతోష్‌గౌడ్‌కు అతని గర్ల్ ఫ్రెండ్ రజని సహకరించిందని పోలీసులకు తెలిపారు.

## ముగిసిన వామ్స్ సింపోజియం

ప్రజాపక్షం/బంజారాహిల్స్: ఐదు రోజుల పాటు జరిగిన ఐఈఈఈ వైర్‌లెస్, యాంటెన్నా, మైక్రోవేవ్ సింపోజియం ముగిశాయి. శాస్త్ర, సాంకేతిక సమావేశాలు, పరిశోధనా పత్రాల సమర్పణలు, వృత్తిపరమైన నెట్‌వర్కింగ్, అంతర్జాతీయ సహకార కార్యక్రమాలతో విజయవంతంగా ముగిసింది. ముగింపు కార్యక్రమానికి వామ్స్ సలహాదారు, యాంటెన్నా శాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్ కె రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

## బిఆర్‌ఎస్‌లో చేరికలు



ప్రజాపక్షం/పంజాగుట్ట: ప్రధాన విపక్షం బిఆర్‌ఎస్‌లోకి యువకులు చేరడం జరిగింది. ఈ మేరకు సోమాజిగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ మహేష్‌యాదవ్ చేస్తున్న కృషికి ఆకర్షితులై పోచమ్మబస్తీకి చెందిన యువకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరినవారిలో జనార్ధన్, శేఖర్, వెంకటేష్, ఉదయ్‌కిరణ్, సాయి, కిరణ్ తదితరున్నారు.

## తాగునీటి సరఫరాలో కాంగ్రెస్ విఫలం



ప్రజాపక్షం/అమీర్‌పేట్: ప్రజలకు తాగునీరు అందించడంలో కాంగ్రెస్ విఫలమయ్యిందని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ఆయన వాటర్ వర్క్స్ ఉన్నత అధికారులతో కలిసి అమీర్‌పేట్ డివిజన్‌లోని బల్కంపేట్, కుమ్మరిబస్తీ, బాపూనగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. తలసాని వెంట వాటర్ వర్క్స్ సిజిఎం ప్రభు, జిఎం ఆశిష్, మేనేజర్ మౌనిక, డివిజన్ బిఆర్‌ఎస్ నేతలు హన్మంతరావు, అశోక్ యాదవ్, నామన సంతోష్, ప్రవీణ్, సంపత్, గోపిలాల్ చౌహన్, గులాబ్ సింగ్, బాసా లక్ష్మి, లక్ష్మి, లలిత తదితరులు ఉన్నారు.

## తెలంగాణ సీనియర్ స్విమ్మింగ్ జట్టుకు యూనిఫాం అందజేత



ప్రజాపక్షం / హిమాయత్‌నగర్ : తెలంగాణ రాష్ట్ర సీనియర్ స్విమ్మింగ్ జట్టు నేషనల్ పోటీలకు సిద్ధమైంది. ఈ నెల 16 నుంచి 21 వరకు గుజరాత్‌లోని వీర్ సావర్కర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగే ఈ పోటీల్లో తెలంగాణ స్విమ్మింగ్ టీం కెప్టెన్ సుహాస్ ప్రీతం మైలారి పాల్గొననున్నది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్ గచ్చిబౌలి ఆక్వాటిక్ స్టేడియంలో సెవెన్ సిస్ ఎంటర్‌టైన్‌మెంట్ లిమిటెడ్ ఆధ్వర్యాన రాష్ట్ర స్విమ్మింగ్ జట్టుకు, మేనేజర్ అండ్ కోచ్‌కు యూనిఫాం, టీషర్ట్స్ కిట్‌లను అందజేశారు.

## రైలు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాపక్షం/కాచిగూడ: పట్టాల వెంట నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని రైలు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. టోలిచౌకి ప్రాంతానికి చెందిన మహబూబ్ పాషా(35)కు గత కొంతకాలంగా మానసిక పరిస్థితి బాగాలేదు. అప్పుడప్పుడు ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయే మహబూబ్ పాషా తిరిగి వచ్చేవాడు. అదేవిధంగా ఇంటి నుంచి బయటకి వెళ్లిన మహబూబ్ పాషా శుక్రవారం రాత్రి బుద్వేల్ శివరాంపల్లి రైల్వే స్టేషన్ ల మధ్య పట్టాల వెంట నడుచుకుంటూ వెళ్తున్నాడు. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన రైలు అతడిని ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు.

# ఇంకుడుగుంత ఉండాల్సిందే

• ప్రతి ఇంటా..అపార్ట్‌మెంట్లలో తప్పనిసరి • జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డి పిలుపు



ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ: ఈ ఏడాది మే, జూన్ నెలల్లో సుమారు 12 వేల అపార్ట్‌మెంట్లలో బోర్లు ఎండిపోయాయని..హైదరాబాద్ చరిత్రలో పెద్ద ఎత్తున భూగర్భ జలాల క్షీణత నమోదవడం ఇదే తొలిసారని.. ప్రతి భవనంలో వర్షపు నీటి సంరక్షణ చర్యలు చేపట్టకపోతే వచ్చే ఏడాది వేసవిలో భూగర్భ జలాల కొరత మరింత తీవ్రంగా మారే అవకాశం ఉందని... అందుకే ప్రతి ఇంటా.. అపార్ట్‌మెంట్‌లో తప్పనిసరిగా ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలని జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఎండీ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ... గోదావరి ఫేజ్2, ఫేజ్3 నీటి ప్రాజెక్టులు పూర్తయ్యే వరకు నీటి వనరుల పరిరక్షణపై ప్రజలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. భవిష్యత్ తరాలకు తగిన నీటి భద్రత కల్పించాలంటే ప్రతి పౌరుడు వర్షపు నీటి సంరక్షణలో భాగస్వామి కావాలని ఆయన కోరారు.

**అధికారులతో జూమ్ మీటింగ్...**

తాగునీరు, సీవరేజ్ సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి జూమ్ మీటింగ్‌లో అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ఉన్నతాధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. అన్ని ప్రధాన రహదారులపై వాటర్ లీకేజీలు, సివరేజీ ఓవర్‌ఫ్లోలు లేకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని ముఖ్య ప్రాంతాల్లో మ్యాన్‌హోల్ మూతలు పరిశీలించి అవసరమైన చోట్ల మరమ్మత్తులు చేయించాలని ఆయన అధికారులను ఆదేశించారు. మ్యాన్ హోళ్ల నుంచి తీసిన వ్యర్థాలను (సిల్ట్) ఎప్పటికప్పుడు తొలగించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఎంసీసీ పిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు.

## కాంగ్రెస్, బిఆర్‌ఎస్ మ్యాచ్ ఫిక్సింగ్ రాజకీయాలు

బిజెపి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి ఎన్.వి. సుభాష్

ప్రజాపక్షం/హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పరిపాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి కేంద్ర ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని బిజెపి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి ఎన్.వి. సుభాష్ అన్నారు. హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో భారీ వర్షాలు, ప్రజా సమస్యలపై సమీక్ష నిర్వహించకుండా ఢిల్లీ చుట్టూ తిరుగుతున్నారని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో గత 12 ఏళ్లుగా దేశం అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో గణనీయ పురోగతి సాధించిందన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.13.50 లక్షల కోట్లకు పైగా నిధులు కేటాయించిందన్నారు. కిమ్ జాంగ్ ఉన్ భావజాలం బిజెపిదని సిఎం చేసిన వ్యాఖ్యలను సుభాష్ ఖండించారు. కుటుంబ పాలన కాంగ్రెస్‌కే కిమ్ జాంగ్ ఉన్ భావజాలం వర్తిస్తుందన్నారు. మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ నాయకురాలి నామినేషన్ తిరస్కరణకు ఆ పార్టీ అంతర్గత విభేదాలే కారణమని ఆరోపించారు. బిజెపికి ఎలాంటి సంబంధం లేదన్నారు. కాంగ్రెస్, బిఆర్‌ఎస్ పార్టీలు కలిసి బిజెపిని లక్ష్యంగా చేసుకుని రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు.

## స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలు భారత రైతులకు తీవ్ర నష్టం: మధుర స్వామినాథన్



ప్రజాపక్షం/హైదరాబాద్: స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలు భారత రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయని ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త మధుర స్వామినాథన్ అన్నారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రొఫెసర్ అరిబండి ప్రసాద్ రావు అధ్యక్షతన జరిగిన అరిబండి లక్ష్మీ నారాయణ 8వ స్మారకోపన్యాస కార్యక్రమంలో ఆమె ముఖ్య వక్తగా ప్రసంగించారు. ప్రపంచ జనాభాలో మనదేశ జనాభా 18 శాతం కాగా ఉత్పత్తిలో 13 శాతం మాత్రమే ఉందని, అందులో కేవలం 3 శాతం మాత్రమే ఎగుమతి అవుతుండగా మిగిలినది దేశంలోనే వినియోగమవుతుందని ఆమె తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలు రైతులకు ఎలా ఉపయోగపడతాయని ప్రశ్నించారు. అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాల్లో రైతులకు భారీ సబ్సిడీలు అందుతుండగా, భారత్‌లో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ వంటి పథకాలు పరిమిత సహాయం మాత్రమే ఇస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. అసమాన పోటీలో భారత రైతులు నిలబడటం కష్టమవుతుందని అన్నారు.వ్యవసాయం క్రమంగా కార్పొరేటీకరణ దిశగా వెళ్తోందని, ట్రాక్టర్లు, విత్తనాలు, పంట ఉత్పత్తుల మార్కెట్ పెద్ద కార్పొరేట్ కంపెనీల చేతుల్లోకి వెళ్తున్నాయని ఆమె హెచ్చరించారు. యుద్ధాలు, ఎరువుల కొరత, డీజిల్ ధరల పెరుగుదల వంటి అంశాలు రైతులను మరింత ఒత్తిడికి గురి చేస్తున్నాయని తెలిపారు.తుఫాన్లు, వరదలు, కరువుల సమయంలో చిన్న, సన్నకారు, కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలు అమలైతే ఈ పరిస్థితి మరింత తీవ్రమవుతుందని హెచ్చరించారు. రైతులు, సామాజిక కార్యకర్తలు, విద్యావంతులు ఐక్యంగా కార్పొరేట్ విధానాలను ఎదుర్కోవాలని ఆమె పిలుపునిచ్చారు. మాజీ ఎంఎల్‌ఏ జూలకంటి రంగారెడ్డి, ప్రొఫెసర్ వి.రంగారావు డాక్టర్ లతీఫ్ పాషా (వ్యవసాయ విశ్వవిద్యాలయం), డాక్టర్ వి సురేష్(హార్టికల్చర్ యూనివర్శిటీ),ప్రొఫెసర్ వీరభద్రరావు లు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పోతినేని సుదర్శన్ రావు, తీగల సాగర్, రైతు సంఘం సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, రాష్ట్ర నాయకులు మూడ్ శోభన్ తదితరులు పాల్గొన్నారు.

## బసవేశ్వరుడి స్ఫూర్తితో చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లు సాధిస్తాం



లింగ బలిజ ఎస్ఎస్‌సి విద్యార్థులకు పురస్కారాలు అందజేసిన ఎంపి ఆర్.కృష్ణయ్య

ప్రజాపక్షం / రవీంద్రభారతి :సమాజంలో రుగ్మతలను రూపుమాపేందుకు పాటుపడిన బసవేశ్వరుడి స్ఫూర్తితో చట్టసభల్లో బిసిలకు 50శాతం రిజర్వేషన్లు సాధించి తీరుతామని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ధీమా వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర వీర శైవ లింగాయత్ లింగ బలిజ సంఘం యువజన విభాగం ఆధ్వర్యంలో పదోతరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన లింగ బలిజ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. సంఘం యువజన విభాగం అధ్యక్షులు భరత్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యకమానికి ముఖ్యఅతిథులుగా ఎంపిలు ఆర్.కృష్ణయ్య, సురేశ్ షెట్కర్ హాజరయ్యారు. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బసవేశ్వరుడి బోధనలు నేటికీ అనుసరణీయమన్నారు. సమాజంలో సంస్కరణలు తెచ్చేందుకు ఆనాడే బసవేశ్వరుడి పూనుకొన్నారని తెలిపారు. బిసిలకు జరుగుతున్న అన్యాయాలపై లింగ బలిజ సంఘం పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్క విద్యార్థి లక్ష్యం పెట్టుకొని, దానిని సాధించేంతవరకు విశ్రమించబోవద్దని సూచించారు. ఎంపి సురేశ్ షెట్కర్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడుతూ తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు పురస్కారాలివ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యువజన విభాగం కార్యదర్శి సోమేశ్వర్, బిసి సంక్షేమ యువజన సంఘం అధ్యక్షులు జిల్లపల్లి అంజి, విద్యార్థి సంఘం కన్వీనర్ మోదీ రాందేవ్, లింగ బలిజ సంఘం ప్రతినిధులు రాజేశేఖర్ అప్ప, రాచప్ప, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఫీజుల స్కీం అమలుకు పాత పద్ధతే ఉత్తమం



కొత్త జిఒలతో గందరగోళం వద్దు: ఎంపి ఆర్.కృష్ణయ్య

ప్రజాపక్షం / హైదరాబాద్ : ఫీజుల రీయింబర్స్‌మెంట్ స్కీం అమలుకు పాత పద్ధతినే కొనసాగించాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రోజుకో జిఒ జారీ చేస్తూ విద్యార్థులను గందరగోళానికి గురిచేయొద్దని కోరారు. శనివారం హైదరాబాద్ విద్యానగర్‌లోని బిసి భవన్‌లో బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ మోదీ రాందేవ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. ఫీజుల స్కీంపై హైకోర్టులో కేసు నడుస్తుండగానే ఏప్రిల్ 30న జిఒ 7 తెచ్చి, దీనిపై వ్యతిరేకత రావడంతో మరో జిఒ 8, జిఒ 9 జారీ చేయడమేమిటని ప్రశ్నించారు. విద్యార్థుల ఖాతాలోనే ఫీజుల వేస్తామనడం తప్పు అని, అడ్మిషన్ల సమయంలో ఫీజుల కొరకు యాజమాన్యాలు ఒత్తిడి తెస్తాయన్నారు. విద్యార్థులను, కాలేజీ యాజమాన్యాలను సందిగ్ధంలోకి పడేసే నిర్ణయాలను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకొచ్చి 33 నెలలకాలంలో ఒక్క రూపాయి కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వలేదని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కీం జోలికొస్తే రాష్ట్రవ్యాప్తంగా రణరంగం చేస్తామని కృష్ణయ్య హెచ్చరించారు. సమావేశంలో నేతలు డా.ర్యాగ అరుణ్ కుమార్, మేకల రాములు, సి.రాజేందర్, జిల్లపల్లి అంజి, లలిత యాదవ్, రమేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫూలే ద్విశతాబ్ది జయంతి ఉత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



ప్రజాపక్షం / రవీంద్రభారతి :బహుజన వైతాళికుడు మహాత్మా జ్యోతిబా ఫూలే అని టిజిసిహెచ్ఈ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం కొనియాడారు. శనివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో ఫూలే – అంబేద్కర్ ఆలోచన సమితి, తెలంగాణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల బిసి అధ్యాపకుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో "మహాత్మా జ్యోతిబా ఫూలే ద్విశతాబ్ది జయంతి ఉత్సవాలు" వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ ఎం.ఎ. మాలిక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పురుషోత్తం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాలిక్ రచించిన " ది స్ట్రగుల్ ఫర్ తెలంగాణ స్టేట్" పుస్తకాన్ని పురుషోత్తం ఆవిష్కరించారు. తెలంగాణ ఉద్యమంలో టిఎంఐఎఫ్ పోషించిన చారిత్రక పాత్రను ఈ పుస్తకం ద్వారా భావితరాలకు అందించడం అభినందనీయమని మాలిక్ పేర్కొన్నారు. 2026 ఏప్రిల్ 11 నుంచి 2027 ఏప్రిల్ 11 వరకు ఏడాది పొడవునా ఫూలే జయంతి ఉత్సవాలు నిర్వహిస్తామని మాలిక్, ప్రధానకార్యదర్శి డా.బాల శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో బిసి సంఘం నేతలు బిజిఆర్ నారగోని, ప్రొఫెసర్ ఎం.రాములు, రిటైర్డ్ డిఎస్‌పి మదనం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## లాలాగూడ క్యారేజ్ వర్క్‌షాప్ పనితీరుపై జిఎం ప్రశంసలు



ప్రజాపక్షం /హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని లాలాగూడ క్యారేజ్ వర్క్‌షాప్ పనితీరు, ఆధునిక సాంకేతికత వినియోగం, భద్రతా ప్రమాణాల అమలుపై దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సంతృప్తి వ్యక్తం చేశారు. భారతీయ రైల్వేల్లో అత్యుత్తమ కోచ్ నిర్వహణ కేంద్రాల్లో లాలాగూడ వర్క్‌షాప్ ఒకటిగా నిలిచిందని పేర్కొంటూ అక్కడి అధికారులు, సిబ్బందిని అభినందించారు. శనివారం లాలాగూడ క్యారేజ్ వర్క్‌షాప్‌ను సందర్శించిన జనరల్ మేనేజర్ సమగ్ర తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్ సుమనా ఆయనకు వర్క్‌షాప్ కార్యకలాపాలు, నిర్వహణ విధానాలు, భద్రతా చర్యలపై వివరించారు. సీనియర్ రైల్వే అధికారులు కూడా ఈ తనిఖీలో పాల్గొన్నారు.తనిఖీని వీల్ షాప్ నుంచి ప్రారంభించిన జీఎం, అనంతరం డీవీ ఓవర్‌హాల్ సెక్షన్, ఎయిర్ బ్రేక్ షాప్, పెయింట్ షాప్, స్ప్రింగ్ షాప్‌లను పరిశీలించారు. వర్క్‌షాప్‌లో అమలు చేస్తున్న భద్రతా ప్రమాణాలు, సిబ్బంది అనుసరిస్తున్న పని విధానాలపై ప్రత్యేకంగా ఆరా తీశారు.అలాగే ఎల్‌హెచ్‌బీ వర్క్‌స్టేషన్, మానిప్యులేటర్, డైనమిక్ వీల్ బ్యాలెన్సింగ్ మెషీన్, షాక్ అబ్జార్బర్ టెస్టింగ్ మెషీన్, ఎయిర్ బ్రేక్ సబ్ స్టోర్స్, న్యూ ట్రిమ్మింగ్ షాప్, ఆప్టికల్ ఎమిషన్ స్పెక్ట్రోమీటర్, యూనివర్సల్ టెస్టింగ్ మెషీన్ వంటి ఆధునిక పరికరాలను పరిశీలించారు.ఈ సందర్భంగా వర్క్‌షాప్‌లో నిర్వహిస్తున్న పనుల నాణ్యతను జీఎం ప్రశంసించారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించి సిబ్బంది నైపుణ్యాలను మెరుగుపరుస్తున్న తీరును అభినందించారు. స్క్రాప్ రహిత యూనిట్‌గా వర్క్‌షాప్‌ను తీర్చిదిద్దడంతో పాటు పచ్చదనాన్ని కాపాడుతున్నందుకు అధికారులు, ఉద్యోగులను ప్రత్యేకంగా మెచ్చుకున్నారు.

## 'ఆహార పదార్థాల ప్యాకేజింగ్'లో పిన్స్,స్టేప్లర్స్ పిన్ను'లను వాడొద్దు..

ఆహార భద్రత ప్రమాణాల సంస్థ ఉత్తర్వులు ...

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో ఇక నుంచి ఆహార పదార్థాల ప్యాకేజింగ్' నిమ్మితం మెటాలిక్ పిన్స్,స్టేప్లర్స్ పిన్ల'ను ఉపయోగించడాన్ని వెంటనే నిలిపివేయాలని భారతీయ ఆహార భద్రత, ప్రమాణాలు (ఎఫ్ఎస్ఎస్ఎఐ) ఆదేశించింది. వ్యాపార సంస్థలు ఇక నుంచి ప్యాకింగ్‌లో మెటాలిక్ పిన్స్, స్టేపర్లర్స్ పిన్లను ఉపయోగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవాలి తెలంగాణ రాష్ట్రంతో సహా అన్ని రాష్ట్రాలలోని కమిషనర్స్ ఫుడ్ సేఫ్టీ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపింది. ఆహార పదార్థాలు, కేక్ బాక్సులు, స్వీట్ బాక్సులు, స్నాక్ ప్యాకెట్లు లేదా టేదా అవే ఫుడ్స్ పార్సళ్లను సీల్ చేయడానికి లేదా ప్యాక్ చేయడానికి మెటాలిక్ పిన్స్/వైర్లను ఉపయోగించడాన్ని తక్షణమే ఆపివేయాలి ఎఫ్ ఎస్ ఎస్ ఎఐ ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఈ మేరకు ఎఫ్ఎస్ఎస్ఎఐ ఉత్తర్వులు జారీ చేసింది. మెటాలిక్ పిన్స్, స్టేప్లర్స్ పిన్లను ఉపయోగించకుండా చూడాలని సూచించింది. ఆహార పదార్థాల ప్యాకింగ్‌లో వీటిని ఉపయోగించడం ద్వారా కొన్ని సందర్భాల్లో ఈ పిన్లు పలు ఆహార పదార్థాల లోపల కలిసిపోతుందని, తద్వారా ఆ పదార్థాలతో పాటు పిన్నులను కూడా వినియోగదారులు తినే అవకాశాలు ఉన్నాయని తెలిపింది. కొందరు ఆహారంతో పాటు వీటిని తినడంతో శరీరంలో అంతర్గత గాయాలు,ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని ఎఫ్ఎస్ఎస్ఎఐ స్పష్టం చేసింది. ఉత్తర్వులను ఉల్లంఘిస్తే 'ఆహార భద్రత,ప్రమాణాల చట్టం, 2006' నిబంధనల ప్రకారం చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపింది.

## బడుల మూసివేత ప్రకటన వెనక్కి తీసుకోవాలి

ప్రజాపక్షం/ఖైరతాబాద్: రాష్ట్రంలో పాఠశాలలను మూసివేసే ఆలోచనను ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని తెలంగాణ విద్యాపరిరక్షణ కమిటీ డిమాండ్ చేసింది. శనివారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో బడుల మూసివేతను నిలిపివేయాలివిద్యారంగానికి బడ్జెట్‌లో 20 శాతం నిధులు కేటాయించాలి అనే అంశంపై తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు ప్రొఫెసర్ కె.చక్రధరరావు మాట్లాడుతూ... రాష్ట్రంలోని 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేలకు కుదిస్తామని ముఖ్యమంత్రి చేసిన ప్రకటనను తీవ్రంగా ఖండించారు. సమావేశంలో కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి ప్రొ.కె.లక్ష్మి నారాయణ, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, న్యూ డెమోక్రసీ గోవర్ధన్, అరుణోదయ విమలక్క, డిబిఎఫ్ శంకర్, విద్యావంతుల వేదిక అంబటి నాగయ్య, వై.అశోక్ కుమార్, రఘుశంకర్‌రెడ్డి, పలు విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొని ప్రసంగించారు.

## ఘటన విషాధకరం

టిజిఎస్‌పిడిసిఎల్ ఆందోళన

ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ: మేడ్చల్ జిల్లా పరిధిలో శనివారం తెల్లవారుజామున(అర్ధరాత్రి) 2:45 గంటల సమయంలో సంభవించిన భారీ గాలివాన కారణంగా గ్రేటర్ హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో చెట్లు నేలకూలాయని.. ఈ క్రమంలోనే లాల్‌బజార్ సెక్షన్ పరిధిలో విషాధకర ఘటన చోటుచేసుకుందని టిజిఎస్‌పిడిసిఎల్ ఆందోళన వ్యక్తం చేసింది. ఘటన పట్ల ఎస్‌పిడిసిఎల్ అధికారులు వివరిస్తూ... ఈ క్రమంలోనే లాల్‌బజార్ సెక్షన్ పరిధిలోని టెలికాంకాలనీ, రోడ్ నెం7, హౌస్ నెం13024/7 సమీపంలో ఒక భారీ వృక్షం నేలకూలి అక్కడ పార్క్ చేసి ఉన్న కారుపై పడింది. చెట్టు కూలిన సమయంలో వీధి దీపాల విద్యుత్ కేబుల్ కూడా తెగి చెట్టు కొమ్మలతో పాటు కారుపై పడటం జరిగింది. ఆ సమయంలో ముగ్గురు వ్యక్తులు కారును పక్కకు జరపడానికి ప్రయత్నిస్తున్న సమయంలో తెగిపడిన విద్యుత్ ప్రవాహం ఉన్న వైరు అక్కడ ఉన్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా కారు యజమాని సందీప్ భార్య ఆ వైరును పక్కకు తొలగించేందుకు ప్రయత్నించగా ఆమెకు విద్యుత్ షాక్ తగిలింది. ఆమెను రక్షించేందుకు ప్రయత్నించిన సందీప్, వారి కుమార్తె రితికకు కూడా విద్యుత్ షాక్ తగిలింది. ఈ విషాద ఘటనలో సందీప్, కుమారి రితిక దురదృష్టవశాత్తు మృతి చెందగా, సందీప్ భార్య ప్రాణాపాయం నుండి బయటపడ్డారు. భారీ గాలివాన కారణంగా ఏర్పడిన అత్యవసర పరిస్థితుల్లో ఆ ప్రాంతంలోటిజిఎస్‌పిడిసిఎల్‌సిబ్బంది విద్యుత్ మరమ్మత్తులు నిమగ్నమై ఉన్నారు. ఘటన గురించి సమాచారం అందిన వెంటనే సంబంధిత ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరాను నిలిపివేసి తదుపరి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజలకు ముఖ్య విజ్ఞప్తి చేస్తూ.. ప్రకృతి వైపరీత్యాలు, భారీ గాలివానలు, వర్షాలు సంభవించిన సమయంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని.. తెగిపడిన విద్యుత్ వైర్లు, కూలిపోయిన విద్యుత్ స్తంభాలు లేదంటే విద్యుత్ సంబంధిత ప్రమాదకర పరిస్థితులు కనిపించిన వెంటనే టిజిఎస్‌పిడిసిఎల్ కాల్ సెంటర్ 1912కు సమాచారం అందించాలి. అలాగే సమీప టిజిఎస్‌పిడిసిఎల్‌అధికారులకు తెలియజేయాలి.ప్రజలు స్వయంగా విద్యుత్ వైర్లు లేదంటే ఇతర విద్యుత్ పరికరాలను తాకేందుకు, తొలగించేందుకు లేదా మరమ్మత్తులు చేయడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించరాదు. ఇటువంటి చర్యలు ప్రాణాపాయానికి దారితీయవచ్చు అంటూటిజిఎస్‌పిడిసిఎల్‌సూచించింది.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో 15 వినూత్న కార్యక్రమాలు

### సాంకేతికత, సంక్షేమం, సాధికారతకు పెద్దపీట
### రాష్ట్రవ్యాప్తంగా వినూత్న కార్యక్రమాలు అమలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజా పాలనప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం సాంకేతికత, రోడ్డు భద్రత, వ్యవసాయం, మహిళా సాధికారత, విద్య, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, యువజన భాగస్వామ్యం తదితర రంగాల్లో 15 వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తోంది. ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలతో పాటు సామాజిక అభివృద్ధి ని లక్ష్యంగా చేసుకుని చేపట్టిన ఈ కార్యక్రమాలు విశేష ఆదరణ పొందుతున్నాయని ప్రభుత్వ అధికార యంత్రాంగం తెలియజేసింది. ప్రభుత్వం తెలియజేసిన సమాచారం ప్రకారం నిజామాబాద్ జిల్లా చంద్రాయణపల్లి వద్ద జాతీయ రహదారి44పై వీడియో ఇన్సిడెంట్ డిటెక్షన్ సిస్టమ్‌ను ప్రారంభించడంతో పాటు నాగర్‌కర్నూల్ జిల్లా తర్నికల్ గ్రామంలో 32 సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా పంచవటి విద్యాలయంలో చిల్డ్రన్స్ ట్రాఫిక్ అవేర్‌నెస్ పార్కును ఏర్పాటు చేసి, చిన్నారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్నారు. పిల్లలు తమ సమస్యలు, అభిప్రాయాలను వ్యక్తం చేసేందుకు పలు జిల్లాల్లో బాల్ పంచాయతీలను ఏర్పాటు చేశారు. రోడ్డు ప్రమాదాల సమయంలో తక్షణ సహాయానికి 48,227 మందికి సిపిఆర్ శిక్షణ అందించగా, 5,863 మందిని ఫస్ట్ రెస్పాండర్లుగా నమోదు చేశారు. డ్రోన్ డెమోన్‌స్ట్రేషన్లు, పిఎం కుసుమ్ పథకం కింద వ్యవసాయ సోలార్ పంప్‌సెట్ల ప్రదర్శనల ద్వారా రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులను పరిచయం చేయడంతో పాటు సహజ వ్యవసాయం, సేంద్రీయ ఉత్పత్తుల మార్కెటింగ్, రైతు వినియోగదారుల అనుసంధానానికి టిజి ఆర్గానిక్స్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఖమ్మం, జనగాం, నిజామాబాద్, వనపర్తి జిల్లాల్లో మహిళల భాగస్వామ్యంతో సోలార్ పవర్ ప్లాంట్లను ప్రారంభించామన్నారు. మహిళలు, పిల్లల పోషణలో తండ్రుల పాత్రను పెంచే లక్ష్యంతో 38,144 మంది పాల్గొన్న ఫాదర్ పార్టిసిపేషన్ క్యాంపెయిన్ నిర్వహించారు.




19,367 మంది గర్భిణులకు అనీమియా స్క్రీనింగ్ నిర్వహించడంతో పాటు పోషకాహార ప్రదర్శనలు, వంటల పోటీలు, డైటరీ డైవర్సిటీ కార్యక్రమాలు చేపట్టడంతో పాటు జెఎన్‌టియుహెచ్‌లో మేకర్ స్పేస్, కోవర్కింగ్ జోన్లు, ఈవెంట్ హాల్, జియో ఇన్ఫర్మాటిక్స్ ల్యాబ్ వంటి ఆధునిక సదుపాయాలను ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణ సందేశంతో 200 మోటరైజ్డ్ ట్రైసైకిళ్లను దివ్యాంగులకు పంపిణీ చేశారు. జూట్ బ్యాగుల పంపిణీతో పాటు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పోక్సో, సైబర్ సేఫ్టీ, బాల్య వివాహాల నివారణ, డ్రగ్స్ నియంత్రణ అంశాలపై 600 మందికిపైగా పోలీసు సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఆర్‌జియుకెటి విద్యార్థులకు 100 ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేసి డిజిటల్ విద్యకు ప్రోత్సాహం అందించడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా 2కే వాక్‌థాన్‌లు, రన్‌లు, స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించి యువతను సామాజిక బాధ్యతల్లో భాగస్వాములను చేశారు. సాంకేతికత, సామాజిక బాధ్యత, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ, యువజన శక్తి వంటి అంశాలను సమన్వయం చేస్తూ ప్రభుత్వం చేపట్టిన ఈ 15 వినూత్న కార్యక్రమాలు రాష్ట్ర అభివృద్ధికి కొత్త దిశను చూపిస్తున్నాయని అధికారులు వివరించారు.

# విలీనం వేళ ఎన్నికలు ఏల?

### ఆర్‌టిసి గుర్తింపు సంఘం ఎన్నికలపై భిన్నాభిప్రాయాలు




**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం అవుతుందా? లేదా? కార్మిక సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తే విలీనం కొండెక్కుతుందా? ముందు కార్మిక సంఘాల ఎన్నికలు నిర్వహించాలా? లేదంటే ప్రభుత్వంలో విలీనం చేయాలా? అనేది ఇప్పుడు ఆర్టీసీలో చర్చనీయాంశంగా మారింది. ముందుగా గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించిన తరువాత సంబంధిత సంఘంతో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే విధి విధానాల గురించి చర్చించి నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం యోచిస్తున్నది. కానీ ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ ప్రతినిధులు మాత్రం ఎన్నికల కంటే ముందుగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని.. అప్పుడు ఆర్టీసీ కార్మికులందరు ప్రభుత్వ ఉద్యోగులు అవుతారని.. తర్వాత ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం లేదని కార్మిక సంఘాల జేఏసీ ప్రతినిధులు పేర్కొంటున్నారు. విలీనం చేయాలని అనుకుంటే ఎన్నికలు ఎందుకు నిర్వహించాలి? అనే ప్రశ్న కార్మికులు లేవనెత్తుతున్నారు. గుర్తింపు సంఘ ఎన్నికల పేరిట కార్మికుల మధ్య గ్రూప్ పంచాయతీలతో విలీన ప్రక్రియను వాయిదా వేసే ప్రమాదం ఉంటుందని, అందువల్ల ఎన్నికల అంశం అవసరం లేదని ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ ప్రతినిధులు కోరుతున్నారు.

#### ఎన్నికలకు సమాయత్తం

ఆర్టీసీ కార్మికుల సంఘం ఎన్నికలకు సమాయత్తం అవుతోంది. ఈ మేరకు ఇటు లేబర్ కమిషన్ కార్యాలయం, అటు ఆర్టీసీ యాజమాన్యం కార్మికుల గుర్తింపు సంఘం ఎన్నికల కోసం కార్యాచరణ రూపొందించాయి. ఇందులో భాగంగానే లేబర్ కమిషనర్ నుంచి ఉద్యోగుల వెరిఫికేషన్ ప్రక్రియకు సన్నద్ధం అవుతున్నారు. వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేసి ఆర్టీసీ అధికారులతో కలిసి గుర్తింపు సంఘ ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని బావిస్తున్నారు. కార్మిక సంఘాల జేఏసీ ప్రతినిధులు పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ ఎన్నికలు జరిగి ఏదో ఒక యూనియన్ గుర్తింపు పొందితే వారితోనే చర్చలు జరిపితే ఏకపక్ష నిర్ణయాలుంటాయని.. అందుకు బదులుగా ఆర్టీసీలో ఉన్న 11 సంఘాలలో ప్రతి సంఘం నుంచి ఇద్దరు ప్రతినిధులను సబ్ కమిటీ ఆహ్వానించి విధివిధానాలలో వారి అభిప్రాయాలు తీసుకుంటే సరిపోతుందని, దాని కోసం ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం లేదని కార్మికులు పేర్కొంటున్నారు. కాగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు సిద్ధంగా ఉందని.. విలీనం విధివిధానాలు రూపొందించే వ్యవహారంలో ఏ కార్మిక సంఘంతో చర్చించాలనే సందిగ్ధత వ్యక్తం అవుతుందని.. అందువల్ల ముందుగా ఆర్టీసీలో గుర్తింపు సంఘ ఎన్నికలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీధర్ తెలిపారు. శనివారం జేబీఎస్‌లోని తన చాంబర్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీన ప్రక్రియపై రకరకాల చర్చలు వస్తున్నాయని, కార్మికులు ఏలాంటి ఆపోహాలకు అవకాశం ఇవ్వకూడదన్నారు. సమ్మె కాలంలో జరిగిన చర్చల్లో మూడు అంశాలను ప్రధానంగా చర్చించారని, ఆర్టీసీ విలీనం అంశం చాలా కీలకమైందని ఇడి శ్రీధర్ తెలిపారు. గుర్తింపు సంఘం ఉంటే చర్చలకు మంచి అవకాశం ఉంటుందని, అందువల్లనే కార్మికశాఖ నుంచి ఎన్నికల వెరిఫికేషన్ ప్రక్రియ మొదలవుతుందని ఇడి అన్నారు.

#### ముందు విలీనమే కావాలి

ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ ప్రతినిధులు అత్యవసర సమావేశం ఎంప్లాయీస్ యూనియన్ కేంద్ర కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా జేఏసీ కీలకమైన నిర్ణయం తీసుకున్నట్లు జేఏసీ నాయకులు చెప్పారు. కార్మిక సంఘాలకు ముందు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని జేఏసీ తీవ్రంగా వ్యతిరేకిస్తూ.. ముందుగా విలీనమే చేయాలని ముఖ్యమంత్రికి వినతి ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ థామస్‌రెడ్డి, కన్వీనర్ మౌలానా, కో కన్వీనర్ కత్తుల యాదయ్య, కో కన్వీనర్ సుద్దాల సురేష్, కో కన్వీనర్ ఇ.యాదగిరి తెలిపారు. ఏదేమైనా ఆర్టీసీలో ఎన్నికలు కార్మికులు, ఉద్యోగులను అయోమయానికి గురిచేస్తున్నాయని చెప్పవచ్చు.

## వాస్తుశిల్ప, ఫోటోగ్రఫీ, కాలిగ్రఫీ కళల సమ్మేళనం

### ఇమేజ్ అండ్ ఇమాజిన్ ప్రదర్శనను ప్రారంభించిన మంత్రి అజారుద్దీన్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** భారతీయ వాస్తు వారసత్వ వైభవం, కాలిగ్రఫీ కళా సౌందర్యాన్ని ఒకే వేదికపై ఆవిష్కరిస్తూ ఏర్పాటు చేసిన ఇమేజ్ అండ్ ఇమాజిన్ ప్రదర్శనను తెలంగాణ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ ప్రారంభించారు. తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని మీడియా ప్లస్ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ విదేశాంగ శాఖ కార్యదర్శి ఔసఫ్ సయీద్, సియాసత్ సంపాదకులు అమేర్ అలీ ఖాన్, టియుడబ్ల్యుజెఎఫ్ అధ్యక్షులు ఎం.ఎ.మాజీద్‌తో పాటు ప్రముఖ కళాకారులు, జర్నలిస్టులు, కళాభిమానులు, వారసత్వ పరిరక్షణకు కృషి చేస్తున్న పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ ప్రదర్శనలో 50కు పైగా వాస్తుశిల్ప ఛాయాచిత్రాలు, దాదాపు 20 అద్భుత కాలిగ్రఫీ కళాఖండాలు ప్రదర్శనకు ఉంచారు. ప్రముఖ వాస్తుశిల్ప ఫోటోగ్రాఫర్ కె. ఎన్. వాసిఫ్, ప్రముఖ కాలిగ్రఫీ కళాకారుడు గౌస్ అర్సాలన్ రూపొందించిన కళాఖండాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మంత్రి మహ్మద్ అజహరుద్దీన్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, చారిత్రక వారసత్వాన్ని కళారూపాల ద్వారా ప్రజలకు చేరవేస్తున్న కళాకారుల కృషిని అభినందించారు. ఇటువంటి ప్రదర్శనలు యువతలో చరిత్ర, సంస్కృతి, కళల పట్ల అవగాహన పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ ప్రదర్శన విద్యార్థులు, యువత, సాధారణ ప్రజల్లో వారసత్వం, కళలు, సంస్కృతి పట్ల ఆసక్తి, అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఏర్పాటు చేశామని నిర్వాహకులు వెల్లడించారు.

## ఒప్పందంపై సంతకాలు ఈరోజే:ట్రంప్

### వెంటనే హోర్ముజ్ జలసంధి తెరుస్తాం

**వాషింగ్టన్:** అమెరికా–ఇరాన్ మధ్య యుద్ధ విరమణ శాంతి ఒప్పందంపై ఆదివారం (జూన్ 14)న సంతకాలు జరుగుతాయని డోనాల్డ్ ట్రంప్ శనివారం రాత్రి పొద్దుపోయాక ప్రకటించారు. ఒప్పందంపై సంతకాలు చేసిన వెంటనే హోర్ముజ్ జలసంధిని అన్ని దేశాల నౌకల రాకపోకలకోసం తెరచి ఉంచుతామని ట్రూత్ సోషల్ మీడియా వేదికగా తెలియజేశారు. అదేవిధంగా సరైన సమయంలో ఇరాన్‌కు వెళ్ళి శుద్ధి చేసిన యురేనియంను తీసుకువస్తామని కూడా చెప్పారు. ''పరిస్థితులు చక్కబడి అంతా ప్రశాంత వాతావరణం నెలకున్న తర్వాత మేం సరైన సమయంలో ఇరాన్ వెళతాం, శక్తిమంతమైన గ్రానైట్ పర్వతాలకింద పాతిపెట్టి ఉన్న శుద్ధిచేసిన అణుధూళిని బయటకు తీసుకువస్తాం'' అని చెప్పారు. ఇరాన్ వద్ద దాదాపు 450 కేజీలకు పైగా శుద్ధి చేసిన, అత్యంత సుసంపన్నమైన యురేనియం ఉందని మొదటినుండీ ట్రంప్ వాదిస్తున్నారు. ''భవిష్యత్తులో ఇరాన్‌తో పాటు యావత్ పశ్చిమాసియా దేశాలతో చాలాకాలం పాటు కలిసి పనిచేయడం కోసం మేం ఎదురుచూస్తున్నాం, ఈ ప్రక్రియ (సంతకాల ప్రకియ, చర్చలు) చాలా త్వరగా, సులభంగా,సజావుగా పూర్తవుతుందని ఆశిస్తున్నాం, ఒకవేళ అలా జరగకపోతే మా దగ్గర ఒక అద్భుతమైన ప్రత్యామ్నాయం ఉంది, దానిని మళ్ళీ ఎన్నడూ ఉపయోగించాల్సిన అవసరం రాకూడదని ఆశిస్తున్నాం'' అని సోషల్ మీడియాలో ఆయన రాశారు. కానీ ఇరాన్ మీడియా నివేదికలు ట్రంప్ ప్రకటనకు విరుద్ధంగా ఉన్నాయి. ఇదిలా ఉండగా ఇరాన్ పార్లమెంటరీ స్పీకర్ మహ్మద్ బాఘేర్ ఘాలిబాఫ్ శనివారం మాట్లాడుతూ, గత ఏడాది ఇదే రోజున (2025 జూన్ 13) ఇరాన్‌పై అమెరికా బలవంతంగా 12 రోజుల యుద్ధాన్ని రుద్దిందని, ఈ యుద్ధానికి ఏడాదికాలం పూర్తయిందని చెప్పారు. ఆ యుద్ధంలో వీరోచితంగా పోరాడి అసువులు బాసిన అమరవీరుల స్ఫూర్తితో ఇరాన్ దేశ అంతిమ విజయం,గౌరవం కోసం ఇరానియన్లు తుదిశ్వాస విడిచే వరకూ ఎంతో ధృఢంగా నిలబడతారని అన్నారు.

## మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ వెనుక రాజకీయ కుట్ర

### బిజెపి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోంది
### టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ ఆగ్రహం




**ప్రజాపక్షం /హైదరాబాద్:** ఎఐసిసి తెలంగాణ ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ వెనుక రాజకీయ కుట్ర ఉందని, బిజెపి ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కుతూ రాజ్యాంగాన్ని అవమానిస్తోందని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఎలాంటి కేసు నమోదు కాకుండా కేవలం నోటీసు ఆధారంగా నామినేషన్‌ను తిరస్కరించడం ప్రజాస్వామ్య దేశంలో జరిగే పరిణామం కాదని విమర్శించారు. గాంధీభవన్‌లో శనివారం మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా ఆయన మాట్లాడారు. 'మీనాక్షి నటరాజన్ గాంధేయవాదిగా, నిష్కళంక రాజకీయ నాయకురాలిగా పేరున్న వ్యక్తి' అని పేర్కొన్నారు. ఆమెకు సంబంధం లేని అంశాన్ని సాకుగా చూపి నామినేషన్‌ను తిరస్కరించడం వెనుక కేంద్ర ప్రభుత్వ ఒత్తిడి ఉందన్నారు. రాజ్యసభలో బలం పెంచుకోవాలనే ఉద్దేశంతో బిజెపి కుట్ర పూరితంగా వ్యవహరించిందని ఆయన విమర్శించారు. ఎన్నికల కమిషన్ 24 గంటల్లో స్పందించకపోవడం కూడా బాధాకరమన్నారు. బిజెపి ఫాసిస్టు విధానాలు దేశంలో స్పష్టంగా కనిపిస్తున్నాయని, ఓటు చోరీ చేసిన బిజెపి ఇప్పుడు సీటు చోరీ చేశారని ఆయన విమర్శించారు. ప్రధాని మోదీ నియంతలా వ్యవహరిస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ఇలాంటి చర్యలు జరిగి ఉంటే మోదీ ప్రధాని అయ్యేవారా అని ప్రశ్నించారు.

#### షబ్బీర్ అలీకి ఇప్పటికే షోకాజ్ నోటీసు ఇచ్చాం

మాజీ మంత్రి షబ్బీర్ అలీ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ, ఆ విషయంపై తొందరపడి మాట్లాడాల్సిన అవసరం లేదని, తన ఆస్తులు, వ్యక్తిత్వం గురించి నిజామాబాద్ ప్రజలకు బాగా తెలుసునని మహేష్‌కుమార్ గౌడ్ చెప్పారు. షబ్బీర్ అలీకి ఇప్పటికే షోకాజ్ నోటీసు జారీ చేశామని, మహిళలను కించపరిచేలా మాట్లాడటం సరికాదని ఆయన అన్నారు. ఏడాది కింద మాట్లాడిన ఆడియో ఇప్పుడు బయటకు రావ డం వెనుక ఉద్దేశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. మీనాక్షి నటరాజన్ అంశంపై బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ స్పందించాలని మ హేష్ కుమార్ గౌడ్ కోరారు. తన గురించి కెటిఆర్ కంటే హరీశ్ రావుకే బాగా తెలుసని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాటం కొనసాగిస్తుందని మహేష్‌కుమార్ స్పష్టం చేశారు.

## మహిళలు బలపడితే.. సమాజం,రాష్ట్రం అభివృద్ధి

### 'ప్రజా ఉద్యమంగా' ముగిసిన మహిళా వారోత్సవాలు: మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహిళలు వ్యవసాయం, సూక్ష్మ వ్యాపార,సేవా, పారిశ్రామిక, పునరుత్పాదక ఇంధన రంగాలతో పాటు ప్రజా నాయకత్వం వంటి అన్ని రంగాల్లో రాణించగలరని 'మహిళా వారోత్సవాలు' నిరూపించాయని రాష్ట్ర పంచాయతీరాజ్ ,గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. మహిళలు బలపడితే కుటుంబం బలపడుతుందని, కుటుంబం బలపడితే సమాజం, రాష్ట్రం అభివృద్ధి చెందుతాయని అభిప్రాయపడ్డారు. 'మహిళా సాధికారత' ఒక కార్యక్రమంగా కాకుండా ప్రజా ఉద్యమంగా మార్చాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పానికి మహిళా వారోత్సవాలు బలమైన పునాది వేశాయని మంత్రి సీతక్క శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం మరిన్ని వినూత్న కార్యక్రమాలు చేపడుతుందని, తెలంగాణ మహిళలను దేశానికి ఆదర్శంగా నిలబెట్టే దిశగా కృషి కొనసాగుతుందన్నారు. మహిళా వారోత్సవాల విజయానికి కృషి చేసిన స్వయం సహాయక సంఘాల సభ్యులు, స్నేహ సంఘాల బాలికలు, అంగన్వాడి సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, యువత,ప్రజలందరికీ మంత్రి సీతక్క ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మహిళా సాధికారతను పరిపూర్ణం చేసేందుకు ఇదే ఒరవడితో పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామీణ మహిళల ఆర్థికాభివృద్ధి, స్వయం సహాయక సంఘాల బలోపేతం, బాలికల్లో నాయకత్వ లక్షణాల పెంపు, మహిళల భద్రత, పారిశ్రామిక ప్రోత్సాహం, అక్షరాస్యత, బాల్య వివాహాల నిర్మూలన, చిన్నారుల సంక్షేమం వంటి విభిన్న అంశాలపై వారంరోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా వేలాది కార్యక్రమాలు నిర్వహించామని, మహిళా శిశు సంక్షేమ శాఖ, ర్ప్, మెప్మా, అంగన్వాడీ వ్యవస్థ, వివిధ ప్రభుత్వ శాఖలు, స్వయం సహాయక సంఘాలు సమన్వయంతో నిర్వహించిన ఈ కార్యక్రమాలు మహిళా సాధికారతను ప్రజా ఉద్యమంగా మార్చాయని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఈ వారోత్సవాల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 8 వేల ఇందిరా మహిళా శక్తి భవనాలకు శంకుస్థాపన చేశామన్నారు.అంగన్వాడి వ్యవస్థ బలోపేతానికి రాష్ట్ర వ్యాప్తంగా 50 కొత్త అంగన్వాడీ భవనాలను ప్రారంభించామని, మరో 27 భవనాలకు శంకుస్థాపనలు చేపట్టామన్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల కింద రూ.500 కోట్ల ప్రోత్సాహకాన్ని విడుదల చేశామని, బస్సుల అద్దె చార్జీల కింద మండల మహిళా సమాఖ్యలకు రూ.20.34 కోట్ల చెక్కులను అందజేసినట్టు మంత్రి సీతక్క తెలిపారు.

## ఆర్‌టిసి హమాలీ పోర్టర్స్ కూలీ రేట్లను వెంటనే పెంచాలి

### సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ రాజ్యసభ సభ్యులు సయ్యద్ అజీజ్ పాషా



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆర్‌టిసి హమాలీ పోర్టర్స్ కూలీ రేట్లను వెంటనే పెంచాలని సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ రాజ్యసభ సభ్యులు సయ్యద్ అజీజ్ పాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ లైసెన్సుడ్ పోటర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో శనివారం ఎంజిబిఎస్‌లో కార్మికుల జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ రంగాలలో పనిచేయుచున్న హమాలీ కార్మికులకు ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి కనీసం 20 శాతానికి తక్కువ కాకుండా కూలీరేట్లను పెంచడం జరుగుతుందని, కానీ గత ఆరు సంవత్సరాలుగా ఆర్‌టిసిల్లో పనిచేయుచున్న హమాలీల కూలీరేట్లను పెంచకపోగా గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం రూ. 10 ఉన్న రేటును రూ. 7.30 కి తగ్గించడం జరిగిందని, నాటి నుంచి నేటి వరకు కూడా కార్మికుల జీతాలు పెంచకపోవడం వలన కనీస వేతనాలకు ఈ కార్మికులు నోచుకోవటం లేదని వారు విమర్శించారు. గత సంవత్సరం బస్ భవన్ ముందు ధర్నా నిర్వహించి ఆర్‌టిసి ఎండికి ఉన్నతాధికారులకు విన్నవించిన నేటికి కూడా వారి జీతాలు పెరగలేదన్నారు. ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ మాట్లాడుతూ ఆర్‌టిసి బస్టాండ్లలో పనిచేయుచున్న హమాలీ కార్మికులను ప్రైవేటు సంస్థలకు అప్పజెప్తామని బెదిరిస్తూ వారి ఉద్యోగానికి భద్రత లేకుండా వారికి కనీస వేతనాలు చెల్లించకుండా కార్మికుల జీవించే హక్కును ఆర్‌టిసి యాజమాన్యం రాష్ట్ర ప్రభుత్వం హరించటం తీవ్ర అన్యాయమన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్ల కోసం భవిష్యత్తులో పోరాటం నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. హమాలీ కార్మికులకు కూలీ రేట్లు పెంచాలని, హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, పిఎఫ్, ఈఎస్‌ఐ లాంటి సామాజిక భద్రత చట్టాలను అమలు చేయాలని రానున్న రోజులలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి హైదరాబాద్ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కిషన్, హమాలీ యూనియన్ నాయకులు దాసు, కాసిం, కొండయ్య, దశరథ తదితరులు పాల్గొన్నారు.

## పాస్‌పోర్ట్ సేవల్లో తెలంగాణ పోలీసులకు జాతీయ స్థాయి గుర్తింపు

### జూన్ 19 న అవార్డ్ ను అందుకోనున్న డిజిపి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పాస్‌పోర్ట్ దరఖాస్తుల పరిశీలన, పోలీసు ధృవీకరణ ప్రక్రియలో అత్యుత్తమ పనితీరు కనబరిచినందుకు తెలంగాణ పోలీస్ శాఖకు కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక గుర్తింపు లభించింది. 2025–26 సంవత్సరంలో పాస్‌పోర్ట్ దరఖాస్తుల ధృవీకరణలో విశిష్ట సేవలు అందించిన రాష్ట్ర పోలీసు సంస్థగా తెలంగాణ పోలీస్ శాఖను ఎంపిక చేస్తూ 'ఇన్‌స్టిట్యూషనల్ పెర్ఫార్మెన్స్ అవార్డు 'అవార్డును ప్రకటించింది. ఈ మేరకు విదేశాంగ మంత్రిత్వ శాఖలో జాయింట్ సెక్రటరీ,చీఫ్ పాస్‌పోర్ట్ ఆఫీసర్ బి.ఎస్. ముబారక్ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సి.వి. ఆనంద్‌కు అధికారిక లేఖ పంపారు. ప్రతి ఏటాజూన్ నెలలో నిర్వహించే పాస్ పోర్ట్ సేవ సందర్భంగా ఈ అవార్డులను ప్రదానం చేస్తున్నారు. ఈ ఏడాది పాస్‌పోర్ట్ సేవా దివస్, పాస్‌పోర్ట్ అధికారుల సదస్సు ఈ నెల 18, 19 తేదీల్లో న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ భవన్‌లో నిర్వహించనున్న కార్యక్రమంలో 19వ తేదీన కేంద్ర విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ చేతుల మీదుగా డిజిపి సి.వి.ఆనంద్ ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు అందుకోనున్నారు.

#### సమర్థ సేవలకు సరైన గుర్తింపు దక్కింది : డిజిపి సి.వి.ఆనంద్

పాస్‌పోర్ట్ జారీ ప్రక్రియలో పోలీసు ధృవీకరణ అత్యంత కీలకమైన అంశమని, ఈ విభాగంలో తెలంగాణ పోలీసులు వేగవంతమైన, పారదర్శకమైన, సమర్థవంతమైన సేవలు అందించడం వల్లే ఈ గుర్తింపు దక్కిందని డిజిపి సి.వి.ఆనంద్ పేర్కొన్నారు.అలాగే పాస్‌పోర్ట్ సేవా దివస్‌లో భాగంగా నిర్వహించే హైలెవల్ సెగ్మెంట్ కార్యక్రమానికి విదేశాంగ మంత్రిత్వ శాఖ నుంచి ప్రత్యేకంగా ఆహ్వానం అందిందని తెలిపారు. రాష్ట్ర పోలీసు శాఖ చేపట్టిన సాంకేతిక ఆధారిత పోలీసు ధృవీకరణ విధానం, వేగవంతమైన సేవలందింపు, ప్రజా కేంద్రిత దృక్పథం వల్లే ఈ జాతీయ స్థాయి గుర్తింపు లభించిందన్నారు. ఈ అవార్డు తెలంగాణ పోలీసుల సేవా నిబద్ధతకు, వృత్తిపరమైన నైపుణ్యానికి మరో నిదర్శనంగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఈ పురస్కారం ద్వారా దేశవ్యాప్తంగా తెలంగాణ పోలీస్ శాఖ ప్రతిష్ఠ మరింత పెరిగిందని, భవిష్యత్తులో కూడా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఇది ప్రేరణగా నిలుస్తుందని డిజిపి అభిప్రాయపడ్డారు.

# నాటుసారాపై సమరభేరి..

**• తెలంగాణలో ఎక్సైజ్ శాఖ స్పెషల్ డ్రైవ్స్ • 621 కేసులు 559 మంది అరెస్టు**





**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో నాటుసారా, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ (ఎన్‌డిపిఎల్), గంజాయి, సింథటిక్ డ్రగ్స్ నిర్మూలనకు ఎక్సైజ్ శాఖ సమరభేరి మోగించింది. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడంతో పాటు అక్రమ మద్యం వ్యాపారానికి చెక్ పెట్టే లక్ష్యంతో జూన్ 12 నుంచి 21 వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్స్ నిర్వహిస్తోంది. ఇప్పటికే పలు జిల్లాల్లో భారీ ఎత్తున దాడులు చేపట్టిన అధికారులు వందలాది కేసులు నమోదు చేసి, పెద్ద మొత్తంలో నాటుసారా, గంజాయి, అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రెవెన్యూ కార్యదర్శి రఘునందన్‌రావు, ప్రొహిబిషన్ అండ ఎక్సైజ్ కమిషనర్ సి. హరికిరణ్, డైరెక్టర్ అవినాశ్ మహంతి ఆధ్వర్యంలో జరిగిన సమీక్ష సమావేశంలో ప్రత్యేక కార్యాచరణకు రూపకల్పన చేశారు. రాష్ట్రంలో నాటుసారా తయారీ, విక్రయాలను పూర్తిగా అరికట్టాలనే లక్ష్యంతో ఎన్‌ఫోర్స్‌మెంట్, స్టేట్ టాస్క్ ఫోర్స్, జిల్లా టాస్క్ ఫోర్స్ బృందాలు రంగంలోకి దిగాయి. మహబూబాబాద్, వనపర్తి, పెద్దపల్లి, మంచిర్యాల, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, సిద్దిపేట, కామారెడ్డి, నాగర్‌కర్నూల్, నిర్మల్, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లో నాటుసారా తయారీ కేంద్రాలపై వరుస దాడులు కొనసాగుతున్నాయి. ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా ఇప్పటివరకు 621 కేసులు నమోదు చేసి 559 మందిని అరెస్టు చేశారు. 100 వాహనాలను స్వాధీనం చేసుకోగా, 2,258 లీటర్ల నాటుసారా, 31,570 లీటర్ల బెల్లం పానకం, 7,526 కిలోల బెల్లాన్ని అధికారులు పట్టుకున్నారు. అలాగే 28 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, బెల్ట్ షాపులపై కూడా కేసులు నమోదు చేశారు. మద్యం దుకాణాల్లో నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలపై ఐదు కేసులు నమోదు చేశారు. ఇక 99 రోజుల ప్రజా ప్రగతి పాలన కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన దాడుల్లో 321 కేసుల్లో 1,294 కిలోల గంజాయి, 1.88 కిలోల ఓజీ కుష్, 2.26 కిలోల హాషీష్ ఆయిల్, 4.98 కిలోల భాంగ్, 47.1 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్నారు. నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్‌కు సంబంధించి 446 కేసుల్లో 3,709 లీటర్ల అక్రమ మద్యాన్ని పట్టుకున్నారు. రాష్ట్రంలో అక్రమ మద్యం, మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా చేపట్టిన ఈ ప్రత్యేక డ్రైవ్ ఎంత మేర ఫలితాలను ఇస్తుందో ఆసక్తిగా మారింది. అధికారులు మాత్రం ఈసారి మరింత కఠిన చర్యలతో నాటుసారా ముఠాలకు గట్టి దెబ్బ తగిలేలా చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేస్తున్నారు.

